వైసీపీ గుప్పిట్లో వ్యవసాయ యంత్రాలు..!



- రాయితీ పరికరాలను సొంతం చేసుకున్న వైసీపీ నాయకులు
- విక్రయించిన కొందరు
- పట్టించుకోని అధికారులు



పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నది బహిరంగ రహస్యమే. ప్రభుత్వ పథకాల లబ్ధిని సైతం అనర్హులు పొందారు. వైఎస్ఆర్ యంత్రసేవ పరికరాలను వైసీపీ నాయకులు సొంతం చేసుకోవడమే అందుకు నిదర్శనం. గత వైసీపీ ప్రభుత్వంలో సబ్సిడీపై అందించిన పరికరాలను వైసీపీ నాయకులు తమ సొంతం అన్నట్లు గుప్పిట్లో పెట్టుకున్నారు. సంఘంలోని మిగతా సభ్యులకు ఇవ్వరు. గ్రామంలోని రైతులకు అద్దెకూ ఇవ్వరు. కొందరైతే సబ్సిడీ యంత్రాలను ఏకంగా విక్రయించి, సొమ్ము చేసుకున్నారు. సబ్సిడీ పరికరాలు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. అన్నీ తెలిసినా.. కళ్లు మూసుకున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైనా సబ్సిడీ పరికరాల వినియోగం, రికవరీకి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

రైతుల ముసుగులో..

జిల్లాలో వైసీపీ నాయకులు రైతుల ముసుగులో రూ.కోట్ల విలువ చేసే రాయితీ యంత్ర పరికరాలు స్వాహా చేశారు. గత వైసీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ యంత్ర సేవ పథకాన్ని ప్రవేశ పెట్టి, రాయితీ యంత్రాలు, పరికరాలు ఇచ్చింది. ఈ పథకంలో అసలు రైతుల కంటే వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధికంగా లబ్ధి పొందారు. 40 శాతం సబ్సిడీతో యంత్రాలు అందించారు. ఉన్నతాధికారుల అలసత్వం, కింది స్థాయి ఉద్యోగుల అవినీతితో రూ.కోట్ల ప్రజాధనం అక్రమార్కుల పాలైంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక కూడా అధికారులు యంత్రాల స్వాహా గురించి పట్టించుకోలేదు. చాలామంది రైతుల ముసుగులో యంత్రాలు తీసుకున్న వైసీపీ నాయకులు వాటిని అమ్మి సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. రైతు సంఘాలకు రాయితీ యంత్రాలు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇదులో 90శాతంపైగా యంత్రాలు అక్రమార్కుల పాలైనట్లు సమాచారం. రాయితీ యంత్రాల స్వాహా పర్వంపై లోతుగా విచారణ చేస్తే వైసీపీ నాయకుల అవినీతి గుట్టు రట్టయ్యే అవకాశం ఉంది.

రూ. 26.75 కోట్లతో యంత్రాల పంపిణీ

2021-23 మధ్య జిల్లాలోని 32 మండలాల్లో 416 రైతు సంఘాలకు రూ.26.75 కోట్లతో రాయితీ యంత్రాలు, పరికరాలు పంపిణీ చేశారు. ఇందుకుగాను రూ.9.53 కోట్ల సబ్సిడీని గత ప్రభుత్వం విడుదల చేసింది. 416 రైతుసంఘాల్లో రెండువేల మందికిపైగా రైతులు ఉన్నారు. వీరందరికీ 255 ట్రాక్టర్లతోపాటు రోటావేటర్లు, మినీ ట్రాక్టర్లు, పంట నూర్పిడి యంత్రాలు, స్ప్రేయర్లు తదితర పరికరాలను రాయితీలో అందించారు. ప్రతి రైతు సంఘంలో ఐదుగురు సభ్యులు ఉంటారు. ప్రభుత్వం యంత్రాల కోనుగోలుకు 40శాతం సబ్సిడీ ఇవ్వగా.. బ్యాంకు రుణం 50 శాతం, పదిశాతం లబ్ధిదారుల వాటాకింద చెల్లించారు. పేరుకు మాత్రం ప్రతి రైతు సంఘంలోని ఐదుగురు సభ్యులుండగా, అందులో ముఖ్యమైన వైసీపీ నాయకుడు రాయితీ యంత్రాలు, పరికరాలను సొంతం చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తద్వారా కోట్లాది రూపాయల ప్రభుత్వ సబ్సిడీని స్వాహా చేయడానికి యంత్ర సేవా పథకం వైసీపీ నాయకులకు వరంగా మారింది. ప్రభుత్వం సబ్సిడీతో అందించిన యంత్రాలను రైతు సంఘంలోని మిగిలిన సభ్యులకు అందుబాటులో ఉంచాలి. రైతు సేవాకేంద్రాల వద్ద యంత్రాలు, పరికరాలు ఉంచి ఆయా గ్రామాల్లో అవసరమైన రైతులకు అద్దెకివ్వాలి. యంత్రాలు రైతు సేవాకేంద్రాల వద్ద కనిపించట్లేదు. యంత్రాలు, ట్రాక్టర్లను వైసీపీ నాయకులు అమ్ముకోగా.. గ్రూపులో మిగిలిన రైతులకు తెలియకుండా సొంత అవసరాలకు ఉపయోగించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.



దుర్వినియోగం చేస్తే సబ్సిడీ రికవరీ చేస్తాం

రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం రాయితీ యంత్రాలు, పరికరాలు అందించాం. రాయితీపై యంత్రాలు తీసుకున్న రైతు సంఘాలు.. వాటిని అవసరమున్న ఇతర రైతులకు అద్దెకు ఇవ్వాలి. విక్రయించడానికి వీలు లేదు. ఇతర రైతులకు అద్దెకివ్వడంలేదని మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. రాయితీ యంత్రాలు, పనిముట్లను విక్రయించినట్లు తెలిస్తే సంబంధిత రైతు సంఘాలకు నోటీసులు జారీ చేసి, ప్రభుత్వం అందించిన సబ్సిడీని రికవరీ చేస్తాం.

-సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

ఆర్థిక స్వావలంబనలో బ్యాంకర్ల పాత్ర కీలకం

- మంత్రి సత్యకుమార్



బ్యాంకర్లతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆర్థిక స్వావలంబన సాధించడంలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. బీజేపీ స్థానిక కార్యాలయంలో మంగళవారం బ్యాంకర్లతో మంత్రి సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. అన్ని సామాజిక వర్గాల వారికి ఆర్థిక స్వావలంబన కల్పించడంలో బ్యాంకులు మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. రుణ మంజూరు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. స్వయం ఉపాధికి తోడ్పాటు అందించాలన్నారు. యువత, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు పథకాలు ఎంతో దోహదపడతాయన్నారు. సమీక్షలు పలువురు బ్యాంకర్లు, అధికారులు పాల్గొన్నారు.

రేపు జిల్లాకు మంత్రి రవీంద్ర రాక

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఈనెల 10న జిల్లా పర్యటనకు రానున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 10న మధ్యాహ్నం 2.25 గంటలకు గోరంట్ల మండలంలోని పాలసముద్రం వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఏపీ ఎస్‌బీసీఎల్ పరిపాలన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. ఆదేరోజు సాయంత్రం బెంగళూరు వెళ్లి, అక్కడి నుంచి విజయవాడ బయల్దేరతారన్నారు.

ఛీకెన్..!



ఫ్రీజర్లో ఉంచిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్న మున్సిపల్ సిబ్బంది

- ప్రజల ప్రాణాలతో చికెన్ సెంటర్ నిర్వాహకుల చెలగాటం
- ఆఫర్ పేరుతో కుళ్లిన మాంసం విక్రయాలు
- ఫ్రీజర్లలో నిల్వ ఉంచి.. మరుసటి రోజు అంటగడుతున్న వైనం
- అధికారుల దాడుల్లో బట్టబయలు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చికెన్ సెంటర్ల నిర్వాహకులు.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. రెండు కిలోల చికెన్ కొంటే మరో కేజీ ఉచితం అంటూ చనిపోయిన, రోగాల పడిన కోళ్ల మాంసాన్ని అంటగడుతున్నారు. విషయం తెలియని జనం ఎగబడుతున్నారు. అనుమానం వచ్చి మున్సిపల్ అధికారులు దాడులు చేయగా.. అసలు విషయం వెలుగు చూసింది. మున్సిపల్ ఏఈ జనార్దన్, సిబ్బంది శివరాజ్, శ్రీనివాసులు, సునీల్ మంగళవారం వాల్మీకి సర్కిల్‌లోని పలు చికెన్ సెంటర్లలో తనిఖీల చేశారు. చనిపోయిన, రోగం వచ్చిన, గాయాలపాలైన కోళ్ల మాంసాన్ని పెద్దఎత్తున స్వాధీనం చేసుకున్నారు. ఫ్రీజర్‌లో నిలువ ఉంచిన 15 కేజీల మటన్‌ను గుర్తించారు. రోగాల బారిన పడిన కోళ్లను టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపారు.



కోడి కాలికి గాయమై, పురుగులు పడిన దృశ్యం



బంపర్ ఆఫర్ బోర్డు

నిబంధనలు తుంగలోకి..

పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లోని పలు చికెన్ షాపుల్లో బంపర్ ఆఫర్ పెట్టి చనిపోయిన, రోగాల బారిన పడిన, గాయాలతో పురుగులు పట్టిన కోళ్లను జోరుగా విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతుండడంతో కోళ్లకు రోగాలు అధికంగా వ్యాపిస్తున్నాయి. దీంతో పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయి. నిబంధనల ప్రకారం రోగాల బారిన పడిన కోళ్లను విక్రయించరాదు. గోతి తీసి, పాతి పెట్టాలి. కొన్ని ఫాంల నిర్వాహకులు.. రోగాల బారిన పడిన కోళ్లను తక్కువ ధరకే విక్రయిస్తున్నారని తెలుస్తోంది. అలా తీసుకొచ్చిన కోళ్లను వధించి, చికెన్ సెంటర్ల నిర్వాహకులు ప్రజలకు అంటగడుతున్నారు. బంపర్ ఆఫర్ అంటూ అంటగడుతున్నారు. ఆ చికెన్ తింటే రోగాల బారిన పడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. గొర్రెలు, మేకల విషయంలోనూ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. జంతువును వధించాలంటే ముందుగా సంబంధిత పశు సంవర్ధక శాఖాధికారి అది ఆరోగ్యంగా ఉందని నిర్ధారించాలి. తరువాత వాటికి సీల్ వేయాలి. అపుడు దానిని వధించి, విక్రయించవచ్చు. ఆ జంతువును కోసిన తరువాత 8 గంటలలోపు విక్రయించాలి. తర్వాత అది విషతుల్యమవుతుంది. సమయం దాటిన తరువాత జంతు మాంసాన్ని వండి, తింటే అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంటుంది. పురంలో మాత్రం జంతువును కోసిన తరువాత మాంసం మిగిలిపోతే దానిని పడేయకుండా ఫ్రీజర్లలో నిలువ ఉంచి, మరుసటి రోజు విక్రయిస్తున్నారు.

హోటళ్లకు విక్రయిస్తాం..

చనిపోయిన, రోగాల బారిన పడిన కోళ్ల మాంసాన్ని ప్రజలకు విక్రయించమనీ, హోటల్, రెస్టారెంట్లకు వేస్తామని షాపుల నిర్వాహకులే చెబుతుండడం గమనార్హం. ఈ లెక్కన పలు హోటళ్లు, రెస్టారెంట్లలో వందల రూపాయలు పెట్టి, తింటున్న చికెన్ ఇలా.. చనిపోయిన, రోగాల బారిన పడిన కోళ్లదన్న విషయం స్పష్టమవుతోంది.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

కల్తీ మాంసం విక్రయాలను అరికట్టే దిశగా మున్సిపల్, పశుసంవర్ధక శాఖలు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు.. మాంసం విక్రయ కేంద్రాలు, హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేయాల్సి ఉంది. తనిఖీలు లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో చికెన్, మటన్ సెంటర్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. చనిపోయిన, రోగాల బారిన పడిన కోళ్ల మాంసాన్ని, మటన్‌ను ఫ్రీజర్లలో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తున్నారు. మామూళ్ల మత్తులోనే ఆయా శాఖల అధికారులు తనిఖీలను అటకెక్కించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాదు, మృతిచెందిన, గాయాలు, రోగాలతో ఉన్న కోళ్లను విక్రయిస్తున్నారని తెలిసినా మున్సిపల్, పశుసంవర్ధక శాఖాధికారులు ఒకరిపై ఒకరు తోసేసుకుంటున్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం



షాపుల నిర్వాహకులు బంపర్ ఆఫర్ పేరుతో కల్తీ చికెన్ విక్రయించి, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. గ్రాము కూడా తూకాల్లో ఎక్కువ ఇవ్వని వ్యాపారులు.. కేజీ ఆ ఫర్‌గా ఇస్తున్నారంటేనే ఇందు లో ఏదో తిరకాసు ఉందని తె లుస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి, కల్తీ చికెన్ విక్రయాలకు అడ్డు కట్ట వేయాలి.

- ఇందాద్, హిందూపురం

హెలిక్యాప్టర్ వద్ద వైసీపీ వర్గీయుల హల్‌చల్.. మాజీ సీఎం జగన్‌కు పోలీసు భద్రత..



లింగమయ్య కుటుంబానికి పరామర్శ



మీ బట్టలు ఊడదీస్తాం..!

- చంద్రబాబు పాలన ఎల్లకాలం ఉండదు
- పోలీసులకు మాజీ సీఎం జగన్ వార్నింగ్
- మజ్జిగ లింగమయ్య కుటుంబానికి పరామర్శ
- హెలీప్యాడ్ వద్ద వైసీపీ నాయకుల రాద్ధాంతం

రామగిరి/కనగానపల్లి/చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన మాజీ సీఎం జగన్ పోలీసులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాము అధికారంలోకి రాగానే బట్టలు ఊడదీస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో కొందరు పోలీసులు టీడీపీ నాయకులకు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారని, అలాంటి వారిని గుర్తుకు పెట్టుకుని మరీ ఉద్యోగాలు ఊడదీస్తామని హెచ్చరించారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో వారం క్రితం జరిగిన ఘర్షణలో మృతిచెందిన మజ్జిగ లింగమయ్య కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. లింగమయ్య భార్య రామాంజినమ్మ, కుమారులు మనోహర్, శ్రీనివాసులుతో మాట్లాడారు. అంతకు మునుపు లింగమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జరిగిన సంఘటనగురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. లింగమయ్య కుమారులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, వైసీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పోలీసులు తమ విధులను మరచి, టీడీపీ ప్రజాప్రతినిధులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. రామగిరి ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ గురించి పరుషంగా మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే, ఆమె కుమారుడితో తమ పార్టీ ఎంపీటీసీల చేత వీడియో కాల్‌లో మాట్లాడించారని ఆరోపించారు. రామగిరి మండలంలో సంఖ్యాబలం లేకపోయినా టీడీపీ నాయకులు ఎంపీపీ పదవి కోసం బెదిరింపులకు దిగారని, పోలీసుల అండతో భయభ్రాంతులకు గురిచేశారని అన్నారు. పెనుకొండలో బైండోవర్ చేసి, టీడీపీ వారిని రప్పించి తమ ఎంపీటీసీ సభ్యులను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఈ ఘటనలో తిరిగి తమ పార్టీ నాయకులపైనే కేసులు నమోదు చేయించారని అన్నారు. చంద్రబాబు పాలన ఎల్లకాలం ఉండదని, తాము అధికారంలోకి వచ్చాక తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని ఆయన పోలీసులను హెచ్చరించారు. ఎంపీపీ ఉప ఎన్నిక సందర్భంలోనే, ఇదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడిపై టీడీపీ వర్గీయులు దాడికి తెగబడ్డారని, అడ్డుకున్నందుకు లింగమయ్యపై, ఆయన కుమారుడిపై దాడి చేశారని ఆరోపించారు. ఈ దాడిలో లింగమయ్య మృతి చెందితే ఆయన భార్య రామాంజినమ్మతో సంతకం చేయించుకుని..

(మిగతా 7వ పేజీలో..)

నోరు అదుపులో పెట్టుకో: సవిత



పెనుకొండ టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చట్టబద్ధంగా పనిచేస్తున్న పోలీసులు, ప్రభుత్వం గురించి ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఊరుకునేది లేదని మాజీ సీఎం జగన్‌ను మంత్రి సవిత హెచ్చరించారు. నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. రాజకీయ ఉనికి కోసం మరోసారి ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. చేతనైతే చెల్లి, తల్లితో పాటు చినాన్న కూతురు సునీత కన్నీళ్లు తుడవాలని, వారికి న్యాయం చేయాలని సూచించారు. పాపిరెడ్డిపల్లిలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణకు రాజకీయ రంగు పులమడం సరికాదని అన్నారు. శవాలతో జగన్ తన రాజకీయ భవిష్యత్తును నిర్మించుకున్నారని, గతంలో తండ్రి మరణాన్ని, తరువాత చినాన్న హత్యను, కోడి కత్తి ఘటనను రాజకీయ లబ్ధికి ఉపయోగించుకున్నారని విమర్శించారు. 2024 ఎన్నికల ముందు గులకరాయి ఘటనను ప్రజలు చీదరించుకున్నారని, 11 సీట్లకే పరిమితం చేశారని అన్నారు. రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తోందని అన్నారు.

విలువల గురించి జగన్ మాట్లాడటం విడ్డూరం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

హిందూపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య విలువల గురించి వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప ప్రకటనలో మండిపడ్డారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను టీడీపీ ఖండిస్తుందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలీసు వ్యవస్థను జగన్ చెప్పుచేతుల్లో పెట్టుకున్నాడన్నారు. ఎస్సీ, బీసీ, మైనార్టీలను వేధించడంతోపాటు కిరాతకంగా చంపారన్నారు. అప్పట్లో ఏ ఒక్కరినీ పరామర్శించని జగన్.. ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణలో వ్యక్తి చనిపోతే శవరాజకీయం చేయడానికి వచ్చాడని విమర్శించారు. కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ కూడా జగన్ వ్యాఖ్యలను ఖండించారు. కురుబ కుటుంబానికి చెందిన లింగమయ్య చనిపోతే పరామర్శించడానికి వచ్చిన జగన్.. అదే రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు కురుబ అలివేలమ్మ జుత్తును కత్తిరించి దాడిచేస్తే పరామర్శించాడా అని ప్రశ్నించారు.

ఒక వరుడు.. ఇద్దరు వధువులు..

- అక్కాచెల్లెళ్లతో వివాహానికి సిద్ధమైన యువకుడు
- పెళ్లి కుమార్తెలు మైనర్లు.. అడ్డుకున్న పోలీసులు

సోషల్ మీడియాలో వారం రోజులుగా ఓ పెండ్లి పత్రిక తెగ వైరల్ అవుతోంది. అందులో వింతేముంది అంటారా? వరుడు ఒక్కడే. వధువులు మాత్రం ఇద్దరు. అది కూడా అక్కాచెల్లెళ్లు. ఇద్దరికీ ఒకేరోజు, ఒకే వేదికపై తాళిబొట్లు కట్టడానికి సిద్ధమయ్యాడు పెండ్లి కుమారుడు. వారి పెండ్లి పత్రికను సోషల్ మీడియాలో చూసిన వారందరూ షాక్‌కు లోనయ్యారు. వివాహం చేసుకుందామంటే ఒక్క అమ్మాయి దొరక్క చస్తుంటే.. వీడెవడో ఏకంగా ఇద్దరిని చేసుకుంటున్నాడంటూ పెళ్లికాని ప్రసాద్‌లు అక్కసు వెళ్లగక్కుతున్నారు. సోషల్ మీడియాలో తెగ పోస్టులు పెడుతున్నారు. పెళ్లయిన వారు సైతం కాలం ఎటుపోతోంది అంటూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆ వివాహ ఆహ్వాన పత్రిక అటు.. ఇటు తిరిగి.. పోలీసుల చెంతకు చేరింది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. పెళ్లిపై ఆరాతీశారు. వధువులిద్దరు మైనర్లు అని తేలడంతో ఇరు కుటుంబాలను పిలిపించి, కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇలా.. ఈనెల 10న జరగాల్సిన వివాహాన్ని అడ్డుకున్నారు.

కర్ణాటకలోని బాగేపల్లి ప్రాంతానికి చెందిన ఇరు కుటుంబాల వారు గోరంట్ల మండలానికి వచ్చి, ఇక్కడే స్థిరపడ్డారు. వారు బంధువులు. ఓ కుటుంబంలోని ఇద్దరు మైనర్ అక్కచెల్లెళ్లను.. మరో ఇంట్లోని గంగరాజుకిచ్చి వివాహం చేయాలని నిశ్చయించారు. ఫంక్షన్‌హాల్‌లో పెళ్లికి ఏర్పాట్లు చేశారు. బుధవారం రిసెప్షన్, గురువారం వివాహం జరగాల్సి ఉంది. విషయం తెలుసుకున్న సీఐ శేఖర్ మంగళవారం అడ్డుకున్నారు. ఇరు కుటుంబాల వారిని స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. పెళ్లి జరగకుండా చర్యలు తీసుకున్నారు. మైనర్లకు వివాహ విషయమై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వరుడు గంగరాజు, వధూవరుల తల్లి దండ్రులపై కేసు నమోదు చేశారు.

- గోరంట్ల, ఆంధ్రజ్యోతి

చావు ఇంటికి వచ్చి జేజేలా..!



జగన్ వ్యాఖ్యలపై పోలీసులు స్పందించాలి

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

- వివరాలు 7లో...


అధరాలి..!

ఆశాజనకంగా చీనీ దిగుబడులు


గంపెడు ఆశలు పెట్టుకున్న రైతులు

గిట్టుబాటు ధర దక్కితే లాభాలే..





మన్నీలలో కోసిన చీనీకాయలు



అనంత మార్కెట్‌కు వచ్చిన చీనీ కాయలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చీనీ సీజన్ మొదలైంది. పంటపై రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో దిగుబడులు ఆశాజనంగా ఉన్నట్లు అన్నదాతలు చెబుతున్నారు. ప్రస్తుతం అనంత వ్యవసాయ మార్కెట్ యార్డులోని చీనీ మార్కెట్‌కు వస్తున్న ఉత్పత్తులను బట్టి చూస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. నాలుగైదు రోజులుగా వెయ్యి టన్నులకుపైగా చీనీ ఉత్పత్తులు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. దిగుబడులకు అనుగుణంగా మార్కెట్‌లో గిట్టుబాటు ధర దక్కితే ఈఏడు రైతుల పంట పండినట్లే.

40వేల హెక్టార్లలో సాగు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 40వేల హెక్టార్లలో చీనీ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 30వేల హెక్టార్లలో దిగుబడులు వస్తున్నట్లు సంబంధిత అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. గతేడాది కంటే ఈసారి దిగుబడులు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. గతేడాది హెక్టారుకు 15 నుంచి 17 టన్నుల దిగుబడులు వచ్చినట్లు ఉద్యాన శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ ఏడాది 20 నుంచి 21 టన్నుల దిగుబడులు వచ్చే అవకాశం ఉందంటున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, నీటి లభ్యత బాగుండడమే ఇందుకు కారణమని అన్నదాతలు పేర్కొంటున్నారు.

గిట్టుబాటు ధర దక్కితే..

దిగుబడులకు అనుగుణంగా గిట్టుబాటు ధర దక్కితే లాభాల పంట పండినట్లేనని అన్నదాతలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మందులు, స్ప్రేయింగ్ ఇతరత్రా వాటితో కలుపుకుని ఎకరానికి రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడుల రూపంలో ఖర్చవుతున్నట్లు రైతులు అంటున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో టన్ను రూ.28వేల నుంచి రూ.30వేల మధ్య పలుకుతోంది. వ్యాపారులకు సూట్ రూపంలో రెండు టన్నులు, ఏరివేత క్రమంలో పది టన్నులకు మరో టన్ను కాయలు పోతాయంటున్నారు. అంటే పది టన్నులకు ఏడు టన్నులకే ధర దక్కుతుంది. ప్రస్తుత ధరలతో రైతులకు ఏకోశానా గిట్టుబాటయ్యే పరిస్థితి లేదంటున్నారు. కనీసం టన్ను రూ.40వేలు పలికితే రైతులకు లాభం చేకూరే వీలుంటుందంటున్నారు. బయటి వ్యాపారులు రాకపోవడంతో ధర పెరగలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. స్థానిక వ్యాపారులు సిండికేట్ అయి ధర నిర్ణయించి, కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా బయటి వ్యాపారులతో మరో రేటు మాట్లాడుకుని పంపుతున్నారన్న వాదనలు ఆయావర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఇతర ప్రాంత వ్యాపారులు వస్తే రైతులకు కొంత మేలు చేకూరే అవకాశం ఉందంటున్నారు.

దిగుబడి బాగుంది..

అనంతపురం రూరల్ మండలం ఎనిమిదెకరాల్లో చీనీ సాగు చేశా. గతంలో కంటే ప్రస్తుతం దిగుబడి బాగుంది. గత ఏడాది చెట్టుకు 60 కేజీల వరకు దిగుబడి వచ్చింది. ఈసారి 80కేజీలకుపైగానే వచ్చింది. గిట్టుబాటు ధర దక్కితే రైతులకు లాభం వస్తుంది. ప్రస్తుత ధరతో గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు. ధర పెరిగితే బాగుంటుంది. కనీసం టన్ను రూ.40వేలతో అమ్ముడుపోతే రైతులకు లాభం చేకూరుతుంది.

- త్రిలోక్‌నాయుడు, రైతు, మన్నీల

ధర చూసి భయమేస్తోంది..



గతేడాది పంట సాగుకు ఇబ్బందులు పడ్డాం. పెట్టుబడులు పెట్టినా నీటి సమస్యతో కష్టపడ్డాం. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత బాగుండటంతో ఆ కష్టాలు తప్పాయి. దిగుబడులు కొంత వరకు బాగానే ఉన్నాయి. ఈ ఏటా పెట్టుబడులకే రూ.10లక్షలకుపైగా ఖర్చయింది. ప్రస్తుత ధర చూస్తే భయమేస్తోంది. టన్ను రూ.30వేలు కూడా పలకడం లేదు. ఇలా అయితే రైతుకు నష్టమే. ధర చూసి రైతులు కాయలు కూడా కోయడం లేదు. సీజన్ ఇంకా ఉండటంతో మంచి ధర వస్తుందని ఆశిస్తున్నాం. మంచి ధర వస్తే కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుంది.

- నరసింహారెడ్డి, రైతు, ముకుందాపురం

నగదు ప్రోత్సాహమేదీ?

రెండు నెలల కిందటే ముగిసిన డీఎస్సీ కోచింగ్



బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం



ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు హాజరైన అభ్యర్థులు(ఫైల్)

జాబితా పంపిన జిల్లా అధికారులు

అభ్యర్థులకు తప్పని ఎదురుచూపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీకి ఉచితంగా శిక్షణ ఇచ్చారు. అందులో భాగంగానే అనంతపురం జిల్లాలోని బీసీ స్టడీ సర్కిల్లో ఉచిత శిక్షణకు నోటిఫికేషన్ విడుదల చేసి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గత నవంబరు 16న డీఎస్సీ ఉచిత శిక్షణను మొదలుపెట్టి జనవరి 31వ తేదీతో ముగించారు. అభ్యర్థులకు శిక్షణా కాలంలో మెటీరియల్, ఉపకార వేతనం చెల్లిస్తామన్న హామీ అలాగే మిగిలిపోయింది. శిక్షణ ముగిసి రెండునెలలు పూర్తయినా రాష్ట్రస్థాయి అధికారుల నుంచి నగదు అందించే విషయంలో ఎలాంటి స్పందన కనిపించలేదు. బీసీ స్టడీ సర్కిల్ జిల్లా అధికారులను ఆరా తీస్తే... వివరాలను రాష్ట్రశాఖకు పంపాం. అక్కడి నుంచి నిధులు విడుదల చేస్తే.. అభ్యర్థుల ఖాతాలకు జమ అవుతుందని చెప్పుకొస్తున్నారు.

మెటీరియల్, నగదు ఏదీ..?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి దాదాపు 210 మంది అభ్యర్థులు శిక్షణకు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 140 మంది ఉచిత శిక్షణకు ఎంపికయ్యారు. మధ్యలోనే 47 మంది శిక్షణకు గైర్హాజరయ్యారు. శిక్షణ ముగిసే సమయానికి 93 మంది అభ్యర్థులు ఉన్నారు. ఇప్పటికే అభ్యర్థులు వారి బ్యాంకు ఖాతా వివరాలను స్టడీ సర్కిల్ అధికారులకు అందజేశారు. వీరందరికి శిక్షణ దరఖాస్తులు తీసుకునే సమయంలోనే మెటీరియల్‌కు రూ. 1000, శిక్షణ కాలానికి నెలకు రూ. 1500 చొప్పున రెండు నెలలకు రూ. 3000 ఉపకార వేతనం చెల్లిస్తామని ప్రకటించారు. ఇప్పటికి వరకూ అభ్యర్థులకు సొమ్ము జమకాలేదు.

శిక్షకులదీ అదే పరిస్థితి...

బీసీ స్టడీ సర్కిల్లో డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇచ్చేందుకు బీసీ స్టడీ సర్కిల్ అధికారులు సెషన్ల వారీగా దాదాపు 15 మందికిపైగా శిక్షకులను నియమించారు. వారు సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇచ్చారు. సెషన్(ఒకటిన్నర గంట) చొప్పున రోజుకు 5 సెషన్ల పాటు అభ్యర్థులకు శిక్షణ అందించారు. వారికి ఇంత వరకూ నగదు జమచేయలేదు. వారు తమ బ్యాంకు ఖాతా వివరాలు స్టడీ సర్కిల్‌కు అందించారు.

వివరాలను రాష్ట్రశాఖకు పంపాం

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అందించిన డీఎస్సీ ఉచిత శిక్షణ మెటీరియల్, ఉపకార వేతనాలకు సంబంధించిన అభ్యర్థుల వివరాలను రాష్ట్ర అధికారులకు పంపాం. ఇంకా కొంత మంది అభ్యర్థుల నుంచి వివరాలు అందాల్సిన ఉంది. రాష్ట్రశాఖ నుంచి ఫండ్ రిలీజ్ అయితే.. నేరుగా అభ్యర్థుల ఖాతాకు నగదు జమవుతుంది. ఈ విషయంలో అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.



- సుమన జయంతి, డైరెక్టర్, బీసీ స్టడీ సర్కిల్



570 మార్కులు సాధిస్తే..

విమానం ఎక్కిస్తా

పదో తరగతి విద్యార్థులకు ఎంఈఓ బంపర్ ఆఫర్

- సొంత మండలంలో విద్యాభివృద్ధికి కృషి
- పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలల అభివృద్ధి

బెళుగుప్ప, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 'రేయ్.. పిల్లలూ..! బాగా చదవండి. మంచి మార్కులు తెచ్చుకోండి. పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకుంటే మిమ్మల్ని విమానం ఎక్కిస్తా'. ఈ మాటలు ఏ తండ్రో తన పిల్లలకు చెప్పినవి కావు. ఓ ఎంఈఓ తన మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇచ్చిన బంపర్ ఆఫర్. ఇలాంటి వాటితో విద్యార్థుల్లో స్ఫూర్తిని రగిలిస్తూ తన సొంత మండలం బెళుగుప్పలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు మండల విద్యాధికారి పాటిల్ మల్లారెడ్డి.

టీచర్ నుంచి ఎంఈఓగా..

పాటిల్ మల్లారెడ్డి స్వగ్రామం బెళుగుప్ప మండలంలోని ఎర్రగుడి. తండ్రి వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటరెడ్డి. తల్లి సుశీలమ్మ. ఈయన బెళుగుప్ప ఉన్నత పాఠశాలలో పదో తరగతి (1978-79) వరకు చదువుకున్నారు. ఎర్రగుడి నుంచి బెళుగుప్పకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రతి రోజు రెండు కిలోమీటర్లు కాలినడకన పాఠశాలకు వచ్చేవారు. ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసి 1989లో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 2023జూలైలో సొంత మండలానికి ఎంఈవోగా వచ్చారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ





పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్మించిన సరస్వతి నిలయం, ఎంఈఓ పాటిల్ మల్లారెడ్డి

చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చర్యలు

చదివిన పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఎంఈఓ మల్లారెడ్డి పూర్వ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. బెళుగుప్ప పాఠశాలలో చదివి ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు తెచ్చుకున్న వారికి, బాగా స్థిరపడిన వారికి పాఠశాలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు వెంకట ప్రసాద్ రాజశేఖర్ సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలకు ప్రధాన ద్వారం, క్రీడలు ఆడేందుకు వివిధ రకాల కోర్టులు, సరస్వతి, గణపతి విగ్రహాల ఏర్పాటు, సమావేశ వేదిక నిర్మాణం, కంప్యూటర్లు, ప్రింటింగ్, స్కానింగ్ మిషనరీ, కుర్చీలు సమకూర్చారు.

విమానమెక్కిస్తా

తన సొంత మండల విద్యార్థులను పదో తరగతిలో జిల్లా టాపర్లుగా నిలపడానికి మల్లారెడ్డి పట్టుదలగా పని చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో 570 మార్కులు సాధిస్తే సొంత ఖర్చులతో బెంగళూరు నుంచి హైదరాబాదు వరకు విమానంలో తీసుకెళ్తానని బంపర్ ఆఫర్ ఇచ్చారు. బెళుగుప్ప టీడీపీ నాయకుడు పెద్ద తిప్పయ్య సహకారంతో మండలంలో పదో తరగతి విద్యార్థులందరికీ స్టడీ మెటీరియల్ అందజేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను స్థానిక టీడీపీ నాయకుల సహకారంతో మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నారు. ఇలా మండల విద్యాభివృద్ధికి మల్లారెడ్డి నిర్విరామంగా కృషి చేస్తూ, బాధ్యత మరువని బడి పంతులుగా మన్నన పొందుతున్నారు.

ఔత్సాహికులకు ప్రోత్సాహం..!

- పరిశ్రమలకు రాయితీలు పెంచుతూ ఉత్తర్వులు
- త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- స్వాగతిస్తున్న పారిశ్రామిక ఔత్సాహికులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు స్థాపించే పారిశ్రామిక ఔత్సాహికులకు రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రోత్సాహాన్ని అందించనుంది. నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతంలోని 2023-2027 పాలసీని రద్దు చేసి, 2024- 2029 కొత్త పారిశ్రామికాభివృద్ధి పాలసీని తీసుకు వచ్చింది. తాజాగా పరిశ్రమల స్థాపనకు రాయితీలు ఖరారు చేయడంతోపాటు అమలుకు సంబంధించిన విధివిధానాలతో ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఎన్నడూలేని విధంగా పెట్టుబడి రాయితీని పెంచింది. త్వరలోనే కొత్త పరిశ్రమల స్థాపనకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. పరిశ్రమల యూనిట్ విలువతోపాటు రాయితీలు పెంచడంపై ఔత్సాహికులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

స్పెషల్ కేటగిరిలో..

స్పెషల్ కేటగిరి కింద మహిళలు, బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, హిజ్రాలకు ఉత్పత్తి, సేవా రంగం, సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు 45 శాతం పెట్టుబడి రాయితీ వర్తింపజేసింది. రూ.2.50 కోట్ల వరకు యూనిట్ విలువ కలిగిన పరిశ్రమలను సూక్ష్మ పరిశ్రమల కేటగిరిలోకి చేర్చారు. గతంలో రూ.కోటి దాకా యూనిట్ విలువ కలిగిన పరిశ్రమలను సూక్ష్మపరిశ్రమలుగా భావించేవారు. రెండు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు. సూక్ష్మ పరిశ్రమలకు రూ.45 లక్షల దాకా సబ్సిడీ సీలింగ్ విధించారు. చిన్న పరిశ్రమలకు 45 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. రూ.25 కోట్ల దాకా యూనిట్ విలువ కలిగిన పరిశ్రమలను చిన్న పరిశ్రమలుగా పరిగణిస్తారు. గతంలో రూ.10 కోట్ల దాకా యూనిట్ విలువ కలిగిన పరిశ్రమలను చిన్న పరిశ్రమలుగా భావించేవారు. మూడు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు. రూ.4.50 కోట్ల దాకా సబ్సిడీ సీలింగ్ విధించారు. మధ్యతరహా పరిశ్రమలకు 35 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. రూ.125 కోట్ల దాకా యూనిట్ విలువ కలిగిన పరిశ్రమలు మధ్యతరహా కిందకు వస్తాయి. గతంలో రూ.50 కోట్ల దాకా యూనిట్ విలువ కలిగిన పరిశ్రమలను మధ్యతరహా పరిశ్రమగా భావించేవారు. రూ.7 కోట్లకు సబ్సిడీ సీలింగ్ విధించారు. నాలుగు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు.



పరిశ్రమల శాఖ జిల్లా కార్యాలయం

ట్రాన్స్‌పోర్టు సర్వీస్..

ట్రాన్స్‌పోర్టు సర్వీస్ కేటగిరిలో ఎస్సీఎస్టీలకు సూక్ష్మ పరిశ్రమల కింద 45 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. రూ.45 లక్షలు సీలింగ్ విధించారు. రెండు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు. చిన్న పరిశ్రమల కింద 45 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. రూ.75 లక్షలు సబ్సిడీ సీలింగ్ విధించారు. రెండు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు. మధ్యతరహా పరిశ్రమల కింద 35 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. రూ.75 లక్షల దాకా సబ్సిడీ సీలింగ్ విధించారు. నాలుగు విడతల్లో సబ్సిడీ సొమ్ము జమ చేస్తారు.

విద్యుత్ సబ్సిడీ..

జనరల్ కేటగిరిలో యూనిట్‌కు ఒక్క రూపాయి విద్యుత్ సబ్సిడీ వర్తింపజేస్తారు. స్పెషల్ కేటగిరిలో సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు యూనిట్‌కు రూ.1.50, మధ్యతరహా పరిశ్రమలకు యూనిట్‌కు ఒక్క రూపాయి సబ్సిడీ వర్తింపజేస్తారు. అన్ని కేటగిరిల పరిశ్రమలకు అమ్మకపు పన్ను (ఎస్‌జీఎస్టీ)పైనా సబ్సిడీ వర్తింపజేయాలని నిర్ణయించారు.

వైసీపీ హయాంలో అరకొరే..


వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక ఔత్సాహికులకు అరకొరగానే సబ్సిడీని వర్తింపజేశారు. అప్పట్లో 2023-27 పాలసీ కింద ఉత్పత్తి, సేవా రంగం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు 15 శాతం సబ్సిడీని మాత్రమే వర్తింపజేశారు. రూ.20 లక్షల సబ్సిడీ సీలింగ్ విధించారు. ఇందులో మహిళలకు రూ.30 లక్షలు సబ్సిడీ సీలింగ్ విధించారు. ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఉత్పత్తి, సేవా రంగాలకు రూ.1.20 కోట్లు, ట్రాన్స్‌పోర్టుకు రూ.75 లక్షలు దాకా సబ్సిడీ సీలింగ్ విధించారు. విద్యుత్ సబ్సిడీ కింద సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు యూనిట్‌కు ఒక్కరూపాయి, ఎస్సీఎస్టీలకు యూనిట్‌కు రూ.1.50 వర్తింపజేశారు. సబ్సిడీ తక్కువగా ఉండడంతో పారిశ్రామిక ఔత్సాహికులు పెద్దగా దరఖాస్తు చేసుకోలేదు.

జనరల్ కేటగిరి..

జనరల్ కేటగిరి (ఓసీ పురుషులు) కింద ఉత్పత్తి, సేవా రంగం సూక్ష్మ పరిశ్రమలకు 25 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. రూ.25 లక్షలకు సబ్సిడీ సీలింగ్ విధించారు. రెండు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు. చిన్న పరిశ్రమలకు 25 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. రూ.1.50 కోట్ల దాకా సబ్సిడీ సీలింగ్ విధించారు. మూడు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు. మధ్యతరహా పరిశ్రమలకు 25 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. రూ.7 కోట్ల దాకా సబ్సిడీ సీలింగ్ విధించారు. నాలుగు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు.

త్వరలో దరఖాస్తుల స్వీకరణ

2024- 2029 పారిశ్రామికాభివృద్ధి పాలసీకి సంబంధించి ప్రభుత్వం జీవోతోపాటు విధివిధానాలను విడుదల చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పెట్టుబడి రాయితీని నిర్ణయించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు త్వరలోనే అవకాశం కల్పించనుంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే పారిశ్రామిక ఔత్సాహికుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ నిబంధనల మేరకు పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.



-శ్రీనివాసయాదవ్, జీఎం, పరిశ్రమల శాఖ

గుంతలకు గుడ్ బై!

జాతీయ రహదారుల మరమ్మతులకు గ్రీన్ సిగ్నల్



గుంతకల్లు వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు (ఫైల్)

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై వాహనదారులకు గుంతల తిప్పలు తప్పనున్నాయి. మరమ్మతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే కొన్నిచోట్ల పనులు కూడా మొదలయ్యాయి. మరికొన్ని చోట్ల ప్రారంభించాల్సి ఉంది. స్వల్పకాలిక నిర్వహణ కింద అధికారులు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 67వ జాతీయ రహదారిపై జిల్లాలోని గడేకల్లు, గుంతకల్లు, డొనేకల్లు ప్రాంతాల్లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాటి మరమ్మతులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. పనులు కూడా పూర్తి చేశారు. అదే తరహాలో ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల మరమ్మతులకు పెద్దఎత్తున శ్రీకారం చుట్టారు.

పండమేరు బ్రిడ్జి మరమ్మతులకు..

అనంతపురం నగర పరిధిలోని పండమేరు బ్రిడ్జి మరమ్మతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో కురిసిన వర్షాలకు పండమేరుకు భారీ వరద వచ్చింది. ఆ నీటి ప్రవాహం కారణంగా పండమేరు బ్రిడ్జి కింది భాగంలో దెబ్బతింది. దీనిని గుర్తించిన జాతీయ రహదారుల అధికారులు ఆర్డీటీ స్టేడియం వద్ద ఉన్న పండమేరు పాత బ్రిడ్జి మీద వాహన రాకపోకలు నిలిపివేశారు. నూతన బ్రిడ్జిపైనే రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో బ్రిడ్జి మరమ్మతులకు స్థానిక అధికారులు నివేదిక పంపారు. అందుకు ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మరమ్మతులు చేపట్టేలా సంకేతాలు వచ్చాయి. మరో రెండు రోజుల్లో ఉత్తర్వులు రానున్నట్లు అధికార యంత్రాంగం చెప్పుకొస్తోంది. వీలైనంత త్వరలో మరమ్మతులు ప్రారంభించే అవకాశం ఉంది.



రోడ్డు మరమ్మతుల తరువాత ఇలా..

ముదిగుబ్బ-కదిరి ఫోర్ లేన్‌కు ఓకే..

శ్రీసత్యసాయి జిల్లాలో 42వ నంబరు జాతీయ రహదారిపై ముదిగుబ్బ, కదిరి మధ్య ప్రస్తుతం డబుల్ లేన్ రోడ్డు ఉంది. 22 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే ఆమోదం లభించనున్నట్లు తెలిసింది. అదే రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించేందుకు రూ.427.26 కోట్లతో ప్రతిపాదనలు పంపగా.. అనుమతులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు చేపట్టనున్నారు.

ముదిగుబ్బలో ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి..

ముదిగుబ్బలో ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి రూ.21.97 కోట్లు మంజూరయ్యాయి. బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇంటర్నల్ రోడ్లు గుంతలమయమయ్యాయి. బైపాస్‌రోడ్డు నుంచి మండల కేంద్రం మీదుగా తిరిగి బైపాస్ వరకు ఇంటర్నల్ రోడ్డు నిర్మించనున్నారు. ఇదే తరహాలో మడకశిరలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా.. పూర్తి కావచ్చాయి.

పనులు వేగవంతం చేస్తాం

జాతీయ రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గడేకల్లు, గుంతకల్లు, డొనేకల్లు ప్రాంతాల్లో రోడ్డు మరమ్మతులు చేపట్టాం. మరికొన్ని పనులకు ప్రతిపాదనలు పంపాం. ఆమోదం లభించిన పనులను వేగవంతం చేస్తాం.

- సుధాకర్‌రెడ్డి, జాతీయ రహదారుల ఈఈ

మీ బట్టలు ఊడదీస్తాం

(5వ పేజీ తరువాయి)

ఇద్దరి పేర్లను మాత్రమే కేసులో చేర్చారని అన్నారు. ఈ దాడిని ప్రోత్సహించిన, దాడి చేసిన వారిపై కేసులు లేకుండా చేశారని అన్నారు.

పబ్లిసిటీ స్టంట్

జగన్ పర్యటనను వైసీపీ పబ్లిసిటీ స్టంట్‌గా మార్చుకుంది. కుంటిమద్ది సమీపంలో హెలిప్యాడ్ వద్దకు జగన్ రాకముందే మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ తమ అనుచరులతో అక్కడికి వచ్చి హల్‌చల్ చేశారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించి, డ్రోన్ కెమరాతో మరీ వీడియో తీయించారు. ఈ క్రమంలో పోలీసులు వారిస్తున్నా వినకుండా వైసీపీ కార్యకర్తలు భారీగా హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నాయి. జగన్ రాగానే దిగేందుకు వీల్లేకుండా హెలిక్యాప్టర్‌ను చుట్టుముట్టారు. పోలీసులను తోసుకుంటూ, వారితో గొడవపడుతూ రభస చేశారు.

పోలీసులతో వాగ్వాదం

చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ఎస్ గేటు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలను తనిఖీ చేసిన తరువాత పాపిరెడ్డిపల్లి మార్గం వైపు అనుమతించారు. ఈ క్రమంలో నాలుగు రోడ్ల కూడలిలో వాహనాలు నిలిచిపోయి జనం ఇబ్బందిపడ్డారు. అనుమతి లేని వాహనాలను పోలీసులు అడ్డుకోవడంతో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. అన్ని వాహనాలను వదిలేవరకూ ఆయన వినుకోలేదు.


బ్యారికేడ్లను తోసుకుని వస్తున్న వైసీపీ శ్రేణులు

చావు ఇంటికి వచ్చి జేజేలా..!

జగన్ వ్యాఖ్యలపై పోలీసులు స్పందించాలి

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చావు ఇంటికి పరామర్శకు వచ్చి, వెకిలి నవ్వులు నవ్వుతూ జేజేలు కొట్టించుకున్నారని మాజీ సీఎం జగన్‌పై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శలు గుప్పించారు. ఒక బీసీ కుటుంబాన్ని పులివెందుల ఎమ్మెల్యే, ఆయన పార్టీ నేతలు అవమానించారని అన్నారు. అసమర్థుడు, చేతగాని దద్దమ్మ ప్రకాశ్ రెడ్డి మాటలు విని జగన్ రెడ్డి ఇక్కడికి వచ్చి పచ్చి అబద్ధాలు చెప్పి వెళ్లారని అన్నారు. గ్రామంలో ఏం జరిగిందో తెలుసుకోకుండా ప్రకాశ్ రెడ్డి ఇచ్చిన స్క్రిప్ట్ చదివేందుకు వచ్చారని అన్నారు. కర్రలతో దాడి జరిగితే కొడవళ్లు, రాళ్లు, రాడ్లు అంటూ జగన్ పచ్చి అబద్ధాలు చెప్పారని అన్నారు. అలాంటి ఆయుధాలను పులివెందులలో బాత్‌రూంలో చంపడానికి ఉపయోగిస్తారని ఎద్దేవా చేశారు. పాపిరెడ్డిపల్లి ఘటన వైసీపీ నేతలకంటే తమకే ఎక్కువ బాధ కలిగించిందని అన్నారు. జగన్ రెడ్డి తనను, తన కుమారుడిని టార్గెట్ చేయడానికి వచ్చారని ఆరోపించారు. 'నీ సొంత చిన్నాన్నను చంపితే.. న్యాయం చేయాలని మీ చెల్లెలు వేడుకున్నా పట్టించుకోలేదు. తల్లికి, చెల్లెళ్లకు న్యాయం చేయలేని నీవు లింగమయ్య కుటుంబానికి ఏ న్యాయం చేస్తావు..?' అని జగన్‌ను ప్రశ్నించారు. గతంలో పరిటాల రవీంద్ర పులివెందులకు వెళితే అడ్డుకున్నారని, అయినా తాము ఇక్కడ అడ్డుకునే ప్రయత్నం చేయలేదని అన్నారు. జిల్లాలో ఉన్న మాజీ ఎమ్మెల్యేలను పాపిరెడ్డిపల్లికి పిలిపించి సెల్ఫీలు దిగారని, షో చేశారని విమర్శించారు. దుఃఖంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఎలా పరామర్శించాలో తెలియదా అని నిలదీశారు. లింగమయ్య కుటుంబానికి ఏం న్యాయం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అంత బలం ఉంటే ఎంపీపీ ఎన్నికను ఎందుకు గెలవలేదో ఒక్కసారి ఆలోచించుకోవాలని సూచించారు. ఎన్నిక ముందురోజు నుంచే గొడవలు పెట్టాలని ప్రకాశ్‌రెడ్డి చూశారని, బీసీ నేతలను రామగిరికి పంపి గొడవలు సృష్టించారని ఆరోపించారు. ఎంపీటీసీల మీద నమ్మకం ఉంటే ఎన్నికలకు హాజరు కాకుండా రామేశ్వరం ఎందుకు తీసుకెళ్లారని ప్రశ్నించారు. ఎస్ఐ సుధాకర్ యాదవ్ గురించి చేస్తున్న వ్యాఖ్యలు నీ స్థాయికి తగునా అని జగన్‌ను నిలదీశారు. ఎస్ఐను దూషిస్తూ నీచంగా మాట్లాడటం సరైంది కాదని అన్నారు. సుధాకర్ యాదవ్ ఎంపీటీసీలతో తమకు ఫోన్‌లో మాట్లాడించారని బైబిల్‌పై ప్రమాణం చేయగలవా? నేను భగవద్గీతపై ప్రమాణం చేసి లేదని చెప్పగలను అని అన్నారు. పోలీసులు ఎక్కడా అడ్డుకోకపోయినా అడ్డుకున్నట్లు జగన్ ప్రచారం చేసుకున్నారని, కానీ పోలీసులు ఆయనకు రెడ్ కార్పెట్ స్వాగతం పలికారని పరిటాల సునీత అన్నారు. ప్రతిపక్షంలో తాము ఉన్నప్పుడు పోలీసుల ద్వారా ఎన్ని ఇబ్బందులు పెట్టారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. కానీ తాము పోలీసుల పట్ల ఎన్నడూ దురుసుగా ప్రవర్తించలేదని అన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రి అయ్యుండి.. పోలీసుల గుడ్డలు ఊడదీస్తానని మాట్లాడటం జగన్ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. పెనుకొండలో ప్రకాశ్ రెడ్డి పోలీసులను పచ్చి బూతులు తిట్టినా పోలీసులు నామమాత్రంగా కూడా స్పందించలేదని అన్నారు. ఎస్పీ రత్న ఎందుకు స్పందించలేదో అర్థంకావడంలేదని అన్నారు. పోలీసులను ఎంత కించపరచినా మాట్లాడకపోతే ప్రజల్లోకి వేరేవిధంగా వెళుతుందని అన్నారు. జగన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎస్పీతోపాటు పోలీసులంతా స్పందించాలని ఆమె కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

బండ్లు పెట్టాం.. డబ్బులు ఇస్తాం..!

పామిడి: పాపిరెడ్డిపల్లి పర్యటనకు వైఎస్ జగన్ వస్తున్నారని, ఆయన పర్యటనలో పాల్గొంటే డబ్బులు ఇస్తామని వైసీపీ నాయకులు ప్రచారం చేశారు. 'రండి.. బండు పెట్టాం.. డబ్బులు ఇస్తాం..' అని పామిడి సమీపంలోని 44వ జాతీయ రహదారిపై జనాన్ని పిలిచారు. అంబేడ్కర్ కాలనీ వద్ద వైసీపీ టౌన్ కన్వీనర్ నగూరు ఈశ్వర్‌రెడ్డి డబ్బులు లెక్కిస్తూ, పంచిపెట్టే వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.


పామిడిలో డబ్బులు పంచుతున్న వైసీపీ టౌన్ కన్వీనర్ నగూరు ఈశ్వర్‌రెడ్డి

విభజన బిల్లును రద్దు చేయండి

ఆలిండియా రిటైర్డు రైల్వేమెన్స్ ఫెడరేషన్



ధర్నా నిర్వహిస్తున్న ఏఐఆర్ఆర్ఎఫ్ నాయకులు

గుంతకల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లను రెండుగా విభజిస్తూ పార్లమెంటులో తెచ్చిన బిల్లును వెంటనే రద్దు చేయాలని ఆలిండియా రిటైర్డు రైల్వేమెన్స్ ఫెడరేషన్ (ఏఐఆర్ఆర్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. రైల్వే విశ్రాంత ఉద్యోగులు మంగళవారం ఉదయం డీఆర్ఎం కార్యాలయం వద్దకు ర్యాలీగా తరలివచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఆర్ఆర్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు జీ జయంత్ కుమార్, వీ సుంకప్ప మాట్లాడుతూ మార్చి 23న పార్లమెంటులో పాత పెన్షనర్లు, కొత్త పెన్షనర్లు అంటూ వేరుచేస్తూ నిబంధనలను సవరించారన్నారు. దీని వల్ల 8వ కేంద్ర సీపీసీలో ఓల్డ్ పెన్షనర్లకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. 6, 7 సీపీసీలలో మాదిరిగానే పెన్షనర్లందరికీ లబ్ధి చేకూరేలా కొత్త నిబంధనలను రద్దు చేయాలన్నారు. రిటైర్మెంటు తేదీతో సంబంధం లేకుండా, వ్యాలిడేషన్ సాకు పెట్టకుండా పాత నిబంధనలనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డీఆర్ఎంకు వినతిపత్రాన్ని అందజేశారు.

జూన్‌కి హంద్రీనీవా పనులు పూర్తి

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు


హంద్రీనీవా కాలువ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను జూన్ పదో తేదీకి పూర్తి చేసి, 3,850 క్యూసెక్కుల నీటిని పారిస్తామని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. గుంతకల్లుకు మంగళవారం ఉదయం వచ్చిన మంత్రి స్థానిక రైల్వే కోజీ గెస్టు హౌస్‌లో బస చేశారు. ఆయన్ను స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు మంత్రిని కలిసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే జయరాం పలు అంశాలపై మంత్రితో చర్చించి, వినతిపత్రాన్ని అందజేశారు. వజ్రకరూరు మండలం రాగులపాడు సమీపంలో హంద్రీనీవా 174 కి.మీ.ల వద్ద నుంచి లింకు కాలువను తవ్వి గుంతకల్లు నియోజక వర్గంలోని 12 చెరువులకు నీటిని అందించాలని కోరారు. గుంతకల్లు మండలంలోని వైటీ చెరువు నుంచి గుత్తి చెరువుకు లింక్ కాలువ నిర్మాణానికి రూ. రెండు కోట్ల కేటాయింపు జరగాల్సి ఉందని, హంద్రీ నీవాకు నీరు వచ్చిన న్నాళ్లూ జీఎస్‌బీసీకి 200 క్యూసెక్కుల నీటిని కేటాయించాలని కోరారు. నియోజకవర్గంలోని చెరువుల మరమ్మతులకు రూ.18 కోట్లను కేటాయించాలని, గుంతకల్లు పట్టణానికి తాగునీటి అవసరాలకు హంద్రీనీవా నుంచి అధికారికంగా నీటిని కేటాయించాలని, తదితర అంశాలపై వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం జీ కొట్టాల వద్ద హంద్రీనీవా కాలువలో జరుగుతున్న వైడెనింగ్ పనులను మంత్రి, ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ, గుమ్మనూరు శ్రీనివాసులు, బండారు ఆనంద్, కేసీ హరి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఊడదీసేందుకు ఇదేమైనా అరటి తొక్కనా..?

రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్



పుట్టపర్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): 'జగన్.. పోలీసుల బట్టలు ఊడదీస్తానంటున్నావ్.. అవేమన్నా నీవిచ్చిన బట్టలనుకుంటున్నావా..? మేం కష్టపడి సంపాదించుకున్నవి' అని రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ అన్నారు. పాపిరెడ్డిపల్లిలో మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ, సోషల్ మీడియాలో మంగళవారం ఓ వీడియో విడుదల చేశారు. తాము కష్టపడి చదువుకుని, రన్నింగ్ రేస్‌లో వేలాది మందితో పోటీపడి పోలీసు ఉద్యోగాన్ని సంపాదించుకున్నామని అన్నారు. 'నువ్వెవడో వచ్చి ఊడదీయడానికి ఇదేమీ అరటి తొక్క కాదు..' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ప్రజల పక్షాన నిజాయితీగా నిలబడతామని, నిజాయితీగానే ఉద్యోగం చేస్తామని, నిజాయితీగానే చస్తామని అన్నారు. అడ్డమైన దారులను తాము తొక్కమని, జాగ్రత్తగా మాట్లాడాలని జగన్‌ను హెచ్చరించారు.

వేసవిలో వీక్లీ రైళ్లు

గుంతకల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి గుంతకల్లు మీదుగా కొన్ని వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హుబ్లీ-వారాణసి ప్రత్యేక వీక్లీ రైలు (నం. 07323) ఇప్పటి నుంచి మే 10వ తేదీ వరకూ ప్రతి శనివారం, దీని తిరుగు ప్రయాణపు రైలును ఈ నెల 8వ తేదీ నుంచి మే 13వ తేదీ వరకూ ప్రతి మంగళవారం నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు హవేరి, రాణిబెన్నూర్, హరిహర్, ధావణగెరె, చిగ్జాజుర్, కడూర్, అరిసికెరె, టుముకూరు, యల్హంక, హిందూపూరం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, బేగంపేట, సికింద్రాబాద్, ఖాజీపేట్, జమ్మికుంట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, బాలార్షా, చంద్రాపూర్, నాగపూర్, ఆమ్లా, బేతూరు, ఇటార్సి, జబల్పూర్, కట్ని, సట్నా, మానిక్‌పూర్, ప్రయాగరాజ్ చౌకీ, మీర్జాపూర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు. అలాగే హుబ్లీ-కటిహార్ ప్రత్యేక రైలు (నం. 07325) ఈనెల 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ ప్రతి బుధవారం, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07326)ను ఈ నెల 12 నుంచి మే 3వ తేదీ వరకూ ప్రతి శనివారం నడుపనున్నట్లు తెలిపారు. ఈ రైలు గదగ్, కొప్పల్, హోస్పేట, తోరణగల్లు, బళ్లారి, గుంతకల్లు, డోన్, నంద్యాల, దిగువమెట్ట, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలేశ్వర్, ఖరగ్‌పూర్, డంకుని, బోలాపూర్ శాంతినికేతన్, మల్దా టౌన్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

చీనీకాయలు టన్ను రూ.23 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23,990 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 1154 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఆర్జేడీ బ్లాగ్‌లో గ్రేడ్-2 హెచ్ఎంల జాబితా

అనంతపురం విద్య, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలోని ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల పరిధిలోని స్కూల్ అసిస్టెంట్లు, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టుల తాత్కాలిక సీనియారిటీ జాబితా http://rjdsekadapa.blogspot.comలో అందుబాటులో ఉందని డీఈఓ ప్రసాద్‌బాబు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యంతరాలుంటే... ఈనెల 11వ తేదీలోగా డీఈఓ కార్యాలయంలో తగిన ఆధారాలతో అందజేయాలని సూచించారు.

పేదలందరికీ నాణ్యమైన వైద్య సేవలు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

జీజీహెచ్‌లో ఆర్ఓ ప్లాంట్, తల్లిపాల నిధి, ధన్వంతరి సమావేశ మందిరం ప్రారంభం


తల్లిపాల నిధిని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆర్ఓ ప్లాంట్, తల్లిపాల నిధి, ధన్వంతరి సమావేశ మందిరాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఆయన మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయలసీమలోనే కర్నూలు తరువాత ఎక్కువ మంది రోగులు వచ్చేది అనంతపురం పెద్దాసుపత్రికే అని తెలిపారు. జీజీహెచ్‌లో ఉన్న అనేక సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిచిపోలేదని, నిరాటకంగా సేవలు ప్రజలకు అందుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు పెండింగ్ పెట్టిన రూ.3వేల కోట్ల బిల్లులను తమ ప్రభుత్వం చెల్లించిందన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సూపర్ స్పెషలిస్టులు, ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది నియామకాలు త్వరలో పూర్తి చేస్తామని వివరించారు. తల్లిపాల విశిష్టతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు.

దాతల సేవలు అభినందనీయం: ఎంపీ

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి ముందుకు వస్తున్న దాతల సేవలు అభినందనీయమన్నారు. త్వరలో ఆసుపత్రిలో రోగులు, బంధువులకు ఉచిత వసతి కల్పించేందుకు అనువుగా విశ్రాంతి గదులు నిర్మిస్తామని తెలిపారు. ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేసిన సప్తగిరి క్యాంఫర్, రూ.40లక్షలతో ధన్వంతరి హాల్‌ను నిర్మించిన తాడిపత్రి ఆర్జస్ స్టీల్ యాజమాన్యాన్ని సన్మానించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు, మెడికల్ ఎడ్యుకేషన్ అడిషినల్ డైరెక్టర్ రఘునందన్, ఏఓ మల్లికార్జున రెడ్డి, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, డీఎంహెచ్ఓ ఈబీదేవి, వైద్య కళాశాలప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఆర్ఎంఓ మాధవి, ప్రొఫెసర్లు, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య ఎస్‌డీసీ అంత్యక్రియలు

నివాళులు అర్పించిన కడప, అనంతపురం అధికారులు


నివాళులు అర్పిస్తున్న కడప స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణారెడ్డి

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ) రమాదేవి (56) అంత్యక్రియలను మంగళవారం కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామంలో అశ్రునయనాల మధ్య నిర్వహించారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లె వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రమాదేవి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆమె పుట్టినిల్లు కంబదూరు మండలం కొత్తపల్లి. మెట్టినిల్లు కూడా ఇదే మండలంలోని తిమ్మాపురం గ్రామం. మంగళవారం ఉదయం తిమ్మాపురానికి భౌతికకాయాన్ని తీసుకువచ్చారు. దీంతో అనంతపురం, కడప రెవెన్యూ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతపురం డీఆర్వో మలోలా, కడప డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కడప డిప్యూటి కలెక్టర్లు నీలిమయ్య, తిప్పేనాయక్, రామకృష్ణారెడ్డి, రామ్మోహన్, మల్లికార్జున, కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు, కంబదూరు తహసీల్దారు బాలకిషన్, ఆర్ఐలు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రమాదేవి భర్త రాజేంద్రనాయక్ ఎస్ఐగా ఉద్యోగ విరమణ చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

అనంతపురంరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశానికి నిర్వహించే బీఆర్ఏజీ సెట్‌కు సంబంధించిన హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని కురుగుంట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి మంగళవారం ప్రకటనలో కోరారు. ఈనెల 13న ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించిన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుజిరీ వ్యాపారి మృతి

కనగానపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తాపురం జంక్షన్ వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని గుజిరీ వ్యాపారి సిరాజ్ (35) దుర్మరణంచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సోమందేపల్లికి చెందిన సిరాజ్ గుజిరీ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడికి భార్య అమరాన్‌తాజ్‌తోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యాపారంలో భాగంగా ముక్తాపురానికి వచ్చిన సిరాజ్ రాత్రికి సొంత ఆటోలో గుజిరీ సామగ్రి వేసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. ముక్తాపురం జంక్షన్‌లో ఆటో ఆపి, నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా.. గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టి, వెళ్లిపోయింది. దీంతో సిరాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

ఎనుములవారిపల్లి వద్ద వీఆర్ఏ..

ముదిగుబ్బ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎనుములవారిపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. నల్లమాడ మండలం రెడ్డిపల్లి వీఆర్ఏ ప్రసాద్(38) అనంతపురంలో ఉన్న భార్య, పిల్లల వద్దకు వెళ్లి మంగళవారం ద్విచక్ర వాహనంపై రెడ్డిపల్లికి విధులకు బయల్దేరాడు. ఎనుములవారిపల్లి సమీపంలోకి రాగానే గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు చేసే బొలెరో వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో వీఆర్ఏ అక్కడికక్కడే మృతి చెందాడు. పట్నం పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఇంటర్వ్యూలకు 14 మంది హాజరు

అనంతపురం విద్య, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా ఐసీడీఎస్ పరిధిలోని పలు పోస్టులకు మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 14 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సెలెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు చేశారు. స్టోర్ కీపర్ కం అకౌంటెంట్‌కు 8 మంది, హౌస్ కీపర్, ఎడ్యుకేటర్, మ్యూజిక్ టీచర్ పోస్టులకు ఒకరు చొప్పున, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్ పోస్టుకు ముగ్గురు హాజరయ్యారు.

మహిళ ఆత్మహత్య


సరస్వతి మృతదేహం

గోరంట్ల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టగుండ్లపల్లికి చెందిన సరస్వతి (30) మంగళవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. చెన్నేకొత్తపల్లి మండల వాసి సరస్వతికి పుట్టగుండ్లపల్లికి చెందిన చేనేత కార్మికుడు విశ్వనాథ్‌తో వివాహమైంది. వారికి కుమార్తెలు సిరి, శ్రీగుణ, కుమారుడు పార్థు ఉన్నారు. విశ్వనాథ్.. భార్య సరస్వతిని వేధించడంతోపాటు తరచూ కొట్టేవాడని ఆమె తల్లి వడ్డె చంద్రమ్మ తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం గదిలోకెళ్లి సరస్వతి ఉరేసుకుంది. వెంటనే గర్తించిన కుటుంబీకులు తలుపులు బద్దలుకొట్టి, ఆమెను గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా.. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

భర్తతో గొడవపడి మరో మహిళ...


నీలమ్మ మృతదేహం

కనగానపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లిలో సోమవారం రాత్రి నీలమ్మ(28) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామగిరి మండలానికి చెందిన నీలమ్మకు మామిళ్లపల్లి వాసి మురళితో వివాహమైంది. వారికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. కుటుంబ సమస్యలతో సోమవారం సాయంత్రం దంపతులు గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన నీలమ్మ రాత్రికి ఇంట్లోని ఓ గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని, ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం ఉదయం కుటుంబసభ్యులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, పరిశీలించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నీలమ్మ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

న్యూస్ బాక్స్

రేషన్ బియ్యం సకాలంలో అందించాలి

ముదిగుబ్బ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో రేషన్ బియ్యం, సరుకులు సకాలంలో అందించాలని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడారు. మండలంలో రేషన్ సరుకులు పంపిణీ సకాలంలో జరగడం లేదని, లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంతో మండలంలో గత కొన్ని నెలలుగా రేషన్ సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. బఫర్ స్టాక్ పేరుతో అధికారులు స్టాక్ పాయింట్ నుంచి డీలర్లకు నిర్ణయించిన కోటా కంటే తక్కువ మొత్తంలో బియ్యం సరఫరా చేస్తుండడంతో, డీలర్లు కూడా ప్రజలకు తూకాల్లో కోత పెడుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు రేషన్ సరుకులు పంపిణీ సక్రమంగా జరిగేటట్లు చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తిప్పయ్య, చిన్నప్ప, రాధాకృష్ణ, శంకర పాల్గొన్నారు.

సజావుగా దూరవిద్య పరీక్షలు

ధర్మవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కెహెచ్ ప్రభుత్వడిగ్రీ కళాశాలలో ఎస్వీ యూనివర్సిటీ దూర విద్యా పరీక్షలు సజావుగా జరుగుతున్నట్టు చీఫ్ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ పరీక్షలు పీజీ చదువుతున్న విద్యార్థులు, దూర విద్య డిగ్రీ ఫైనల్ చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షకు 130మందిని అలాట్‌మెంట్‌చేయగా ప్రతి రోజు 60శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు. ఈనెల 23తో ఈ పరీక్షలు ముగుస్తాయన్నారు.

సర్వేలు త్వరగా పూర్తి చేయాలి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదేశాల మేరకు చేపట్టిన వివిధ సర్వేలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్వేలపై సమీక్షించారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోపు సర్వేలన్నీ పూర్తి చేయాలన్నారు. పీజీఆర్ఎస్, వర్క్‌ఫ్రం హోమ్, చిల్డ్రన్ విత్ అవుట్ ఆధార్ తదితర సర్వేలపై సమీక్షించారు, సర్వేలో వెనుకబడిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే పూర్తి చేయకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీక్రిష్ణ, ఎంపీడీఓ పోలప్ప, హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాసామగ్రి పంపిణీ


క్రీడాసామగ్రితో విద్యార్థులు

కదిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్డీటీ వ్యవస్థాపకుడు మంచూ ఫెర్రర్ జయంతి సందర్భంగా మంగళవారం దాదాపు రూ.35 వేల విలువ చేసే క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీ శాంతమ్మ, ఏటీఎల్ లక్ష్మన్, సీఓ శ్రీదేవి, పాఠశాల హెచ్ఎం వెంకటాచలం, వ్యాయమ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్ఏ కుటుంబానికి పరామర్శ

నల్లమాడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వీఆర్ఏ ప్రసాద్ (38) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా.. ఆయన కుటుంబాన్ని తహసీల్దార్ రంగనాయకులు, సిబ్బంది పరామర్శించారు. ప్రభుత్వం నుంచి వచ్చే సాయం త్వరగా అందేలా కృషి చేస్తామన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలను మంగళవారం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి జోత్స్న, క్షయ నివారణ వైద్యాధికారి గాయత్రి మాట్లాడుతూ.. క్షయ వ్యాధిగ్రస్తులతో సన్నిహితంగా ఉండేవారు ఈ పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలన్నారు. ముందస్తు వైద్యపరీక్షలతో క్షయవ్యాధి నివారణ సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, పీహెచ్ఎన్ లలితకుమారి, స్టాఫ్ నర్స్ పద్మావతి, ల్యాబ్‌టెక్నీషియన్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ


టీడీపీ సభ్యత్వ కార్డులతో నాయకులు, కార్యకర్తలు

ధర్మవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 29, 30 వార్డుల్లో టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి.. టీడీపీ సభ్యత్వ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. నియోజవర్గంలో 65 వేల మందికి సభ్యత్వ కార్డులు మంజూరయ్యాయని, 29, 30 వార్డుల కో-ఆర్డినేటర్, టీడీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపాలు, ఆది, ఈశ్వరయ్య, నాయుడు,శంకర, మురళి, నరేశ్ పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుల హేతుబద్ధీకరణ ఆపాలి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అధ్యాపక పోస్టుల హేతుబద్ధీకరణ ఆపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషం మహేంద్ర పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ కళాశాలలో హేతుబద్ధీకరణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 430 అధ్యాపక పోస్టులను వివిధ కళాశాల నుంచి షిఫ్టింగ్, కన్వెర్షన్ చేయడం వల్ల గ్రామీణ కళాశాలల్లో విద్యాబోధన కుంటుపడుతుందన్నారు. అర్థశాస్త్రం, ఇంగ్లీషు, వ్యాయామ అధ్యాపక పోస్టులు ఇతర కళాశాలకు బదిలీ చేయడం వల్ల బోధనపై ప్రభావం పడుతుందన్నారు. అధ్యాపక పోస్టులు యథావిధంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫయాజ్, ఫారూక్, గణేష్, నవీన్ పాల్గొన్నారు.

ఉత్కంఠగా హాకీ పోటీలు

ధర్మవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల హాకీ పోటీలు మూడో రోజైన మంగళవారం ఉత్కంఠ భరితంగా సాగాయి. తిరుపతి-అనకాపల్లి జట్లు తలపడగా 3-1గోల్స్ తేడాతో తిరుపతి, అన్నమయ్య-శ్రీకాకుళం జట్లు తలపడగా 6-0 గోల్స్ తేడాతో అన్నమయ్య, కాకినాడ, అనంతపురం జట్లు తలపడగా 5-3 గోల్స్ తేడాతో కాకినాడ, కడప, శ్రీసత్యసాయి జట్లు తలపడగా 3-0 గోల్స్ తేడాతో కడప జట్లు గెలుపొందాయి. బుధవారం ఉదయం సెమీ ఫైనల్‌లో తిరుపతి-కాకినాడ జట్లు, అన్నమయ్య-కడప జిల్లా జట్లు తలపడనున్నాయి. వీటిలో గెలుపొందిన జట్లకు మధ్యాహ్నం ఫైనల్స్ నిర్వహిస్తారు.


తలపడుతున్న జట్లు

చదువు సాగేదెలా..?


గిరిజన బాలికల గురుకుల పాఠశాల


ఖాళీగా ఉన్న రెగ్యులర్ ప్రిన్సిపాల్ రెసిడెన్షియల్ భవనం

- 'గురుకులం'లో సమస్యల తిష్ట
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- క్రీడామైదానమూ కరువు
- బాలికల స్కూల్లో పురుషుల నియామకం
- ఆందోళనలో విద్యార్థినుల తల్లిదండ్రులు
- పర్యవేక్షించని ఉన్నతాధికారులు

తనకల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీజీ ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి గిరిజన బాలికల విద్యాభివృద్ధి కోసం ఈ పాఠశాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆశయం నేరవేక పోగా.. గురుకులంలోని బాలికలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అందులో 4 నుంచి 10 తరగతి వరకు సుమారు 500 విద్యార్థినులు ఉంటున్నారు. ఆ పాఠశాలలో బాలికలకు ఆటస్థలం లేదు. పాఠశాలల సెక్యూరిటీ సిబ్బందిగా మహిళలను నియమించిన అధికారులు, బోధన - బోధనేతర సిబ్బందిగా పురుషలను నియమించారు. బాలికల వసతి గృహాల్లో పురుషలను సిబ్బందిగా నియమించకూడదన్న నిబంధనలున్నా.. ఈ గురుకుల పాఠశాలలో ఆ నిబంధలను తుంగలో తొక్కి పురుషులను నియమించడంపై గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- సిబ్బంది కొరత

ఈ పాఠశాలకు రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించలేదు. దీంతో పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయురాలుకు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ బాధ్యతలు అప్పగించారు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. తమతో పాటే పనిచేస్తున్న ఉపాధ్యాయురాలికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో పాఠశాలలో పనిచేస్తున్న బోధనా - బోధనేతర సిబ్బంది మధ్య సమన్వయ లోపం ఏర్పడింది. గత యేడాది గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది మధ్య వివాదాలు తారాస్థాయికి చేరాయి. దీంతో జిల్లా అధికారులు ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఎంపీడబ్ల్యూ (మల్టిపర్పస్ వర్కరు), వంట మనిషి, సహాయ వంట మనిషిని ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై పంపారు. మరో వంట మనిషి ఖాదర్‌వలీ అనారోగ్య సమస్యలతో మరణించాడు. మరో ఎంపీడబ్ల్యూ సుబ్బన్న స్వచ్ఛందంగా పనిచేయలేని వెళ్లిపోయారు. ఇక పాఠశాలలో ఇంగ్లీషు, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులనూ అధికారులు భర్తీ చేయలేదు. దీంతో బోధన కూడా కుంటుపడుతోంది. దీంతో పాఠశాలలో సిబ్బంది కొరత తీవ్రమైంది. పనిఒత్తిడి కారణంగా మిగిలిన సిబ్బంది సహకరించకపోవడంతో పాఠశాలలతో సమస్యలు తీవ్రవయ్యాయి.

- పర్యవేక్షణ లోపం

ఈ పాఠశాలను ఉన్నతాధికారులు పర్యవేక్షించడం లేదు. దీంతో పాఠశాలలో సమస్యలోని సమస్యల గురించి పట్టించుకునేవారే కరువయ్యారు. ఇటీవల నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆకస్మికంగా ఈ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో పాఠశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది మూడురోజులకు సరిపడేలా ముందుగానే రిజిష్టర్లతో సంతకాలు చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ దుస్థితికి చేరిందని, ఇప్పటికైనా ఆ పాఠశాలలో నెలకున్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన ప్రాజెక్టు గురుకుల పాఠశాలలో సమస్యలు ఉన్న మాట వాస్తవమే. సిబ్బంది మధ్య గొడవల కారణంగానే ఇక్కడ పనిచేస్తున్న ముగ్గురు సిబ్బందిని డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపాం. ఈ విషయాలన్నింటిని ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లాం. విద్యాసంవత్సరం ప్రారంభం అయ్యేలోపు ఆ పాఠశాలలో నెలకున్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తాం.

-మోహన్‌రావు, డీటీడబ్ల్యూఓ

వైద్యశిబిరాన్ని ప్రారంభించిన మంత్రి

తాడిమర్రి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన మెరుగైన వైద్యసేవలందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గొప్ప ఆలోచనలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. అనంతరం డాక్టర్లు, రోగులతో మాట్లాడి రోగులకు వైద్యసేవలు అందించాలని డీఎం అండ్ హెచ్ఓ ఫైరోజ్ బేగంకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ బాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ రంగారావు, డాక్టర్ హరిత, టీడీపీ మండల కన్వీనర్ కూచి రాము, బీజేపీ మండల కన్వీనర్ దేవర రాము, నిడిగల్లు సర్పంచ్ గోనుగుంట్ల భూషణ్, నాయకులు హర్ష, అశ్వర్థ, చంద్ర, విశ్వనాథ్, కేశవరెడ్డి పాల్గొన్నారు.

- ప్రతికార్యకర్తా ఎదగాలి

ధర్మవరం : పార్టీలో ప్రతి కార్యకర్త భవిష్యత్తులో ఓ నాయకుడిగా ఎదగాలని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.ఎన్డీఏ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అభివృద్ధిలో కీలకంగా పనిచేస్తున్న ప్రతి ఒక్క నాయకుడికి, కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. సామాన్య కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమై నేడు ఈ స్థాయికి ఎదిగానన్నారు.

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ధర్మవరం: నియోజకవర్గంలోని 20 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.18,81,558 మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను మంత్రి సత్యకుమార్ ఎన్డీఏ కార్యాలయంలో బాధితులకు అందజేశారు.


సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ అనంతరం లబ్ధిదారులతో మంత్రి సత్యకుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ట్యాంక్ కూల్చివేత


కూల్చి వేసిన ట్యాంక్

కదిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలం బట్రేపల్లి, రెక్కమాను మధ్యలో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణంతో రోడ్డు పక్కనున్న ట్యాంక్ రోడ్డు మధ్యలోకి వచ్చింది. ఆ ట్యాంక్ చుట్టూ మట్టి తొలగించడంతో అది కూలేపోయే ప్రమాదం ఏర్పడింది. అది కూలి రోడ్డుపై వెళ్తున్న వాహనాలపై పడితే.. భారీ ప్రాణనష్టం జరిగే ప్రమాదముంది. అయినా ఆ ట్యాంక్‌ను కూల్చకుండా కొన్ని నెలలుగా అధికారులు అలాగే వదిలేశారు. దీనికి గత నెల 30న ఓ వార్తను ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు ఆ ట్యాంక్‌ను కూల్చివేశారు.

పశువుల తరలింపు


గొర్రెల కోసం వేసిన కంచెను తొలగిస్తున్న ఎంపీడీఓ

నల్లమాడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్‌బండవాండ్లపల్లి సమపంలో నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనం నిరుపయోగంగా ఉంది. దీంతో అందులో గ్రామస్థులు పశువులను ఉంచుకున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి మంగళవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఎంపీడీఓ ఆజాద్, పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ్ బండల వాండ్లపల్లిలోని ఆ హెల్త్ క్లినిక్ వద్దకెళ్లి గొర్రెలు, ఆవులను బయటకు పంపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి.. ఈ భవనాన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

కొత్తచెరువు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి బాబా భజన మందిరంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఇందులో ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షణ అడిషనల్ ప్రాజెక్టు అధికారి దేవరాజ్, ఆనంద్, అరుణ,లలిత, నాయకులు లక్ష్మీనారాయణ, ఒలిపి శీన, సామకోటి ఆదినారాయణ, మాణిక్యంబాబా పాల్గొన్నారు.

- ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

ఓబుళదేవరచెరువు : మండలంలోని వడ్డివారిపల్లి వద్ద ఎస్సీ బాలుర వసతి గృహంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే అమడగూరులోని వ్యవసాయ గోడౌన్‌లోనూ కుట్టు శిక్షణను ప్రారంభించారు. ఇందులో ఆర్డీఓ సువర్ణ, తహసీల్దార్ అనంతచారి, మండల కన్వీనర్లు శెట్టివారి జయచంద్ర, గోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు పిట్టా ఓబులరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

- వైసీపీ నుంచి టీడీపీలో..

మండలంలోని రామిరెడ్డిపల్లికి చెందిన ఉప్పర శ్రీనివాసులు, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

- నల్లమాడ: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు, మైలే రామచంద్ర, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

- నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

పుట్టపర్తిరూరల్ : నియోజకవర్గంలోని ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా బుధవారం ఉదయం 10.00 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు.

- టీడీపీ కార్యకర్తకు నివాళి

పుట్టపర్తి మండలం రాచువారిపల్లిలో సోమవారం విద్యుత్‌షాక్‌తో టీడీపీ కార్యకర్త నంబూరి ప్రసాద్ మరణించిన విషయం తెల్సిందే. ఎమ్మెల్యే, మాజీ మంత్రి రాచువారిపల్లికు వెళ్లి.. ప్రసాద్ మృతదేహానికి నివాళులర్పించారు. వారి వెంట రూరల్ కన్వీనర్ విజయ్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ బొమ్మయ్య, స్థానిక సర్పంచు, టీడీపీ నాయకులు ఉన్నారు.


కొత్తచెరువు : దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే


నల్లమాడ : ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో..

క్రైం న్యూస్..

వ్యక్తి ఆత్మహత్య


నరసప్ప (ఫైల్)

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడం పల్లికి చెందిన సుంకర నరసప్ప (57) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను చాలా రోజుల నుంచి కడుపు నొప్పి, ఇతర అనారోగ్య సమస్యలు బాధపడుతున్నాడు. మంగళ వారం ఉదయం పొలానికి వెళ్లిన అతను వేపచెట్టుకు పంచతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కలవారు గమనించి కుటుం సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరసప్ప భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

తోటలో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ముదిగుబ్బ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ మాజీ ఎంపీపీ వేలూరి మాలతి తోట సమీపంలోని అడవికి నిప్పు పెట్టడంతో.. ఆ మంటలు తోటకు వ్యాపించాయి. చీనీ, టెంకాయ, నేరేడు చెట్లతో పాటు డ్రిప్ పరికరాలు, పైపులు పూర్తిగా కాలిపోవడంతో దాదాపు రూ. 2.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. కదిరి ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించడంతో ఆ సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

డ్రిప్, పైపులకు నిప్పు


కాలిపోయిన డ్రిప్ సామగ్రి, పైపులు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాబాసాహెబ్ పల్లి వద్ద ఓడీసీకి చెందిన చిల్లర ఆంజనేయులు పొలంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో డ్రిప్, పైపులు దగ్ధమయ్యాయి. బోరు ఫిల్టర్‌పై భాగంగా కూడా దగ్ధమైంది. గమనించి చుట్టుపక్కలవారు తమకు సమాచారం ఇవ్వడంతో పొలం వద్దకు వెళ్లి మంటలు ఆర్పివేసినట్లు ఆంజనేయులు చెప్పారు. ఈ ప్రమాదంతో రూ.40వేలు నష్టం జరిగిందని, తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

బంగారు గొలుసు చోరీ

కదిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వాణీవీధికి చెందిన రాధరాణమ్మ మెడలోని మూడున్నర తులాల బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు లాక్కెళ్లారు. కదిరిరూరల్ మండలం ముష్టిపల్లిలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఆమె వాణీవీధిలో నివాసముంటున్నారు. సోమవారం రాత్రి ఆమె, తన కుమార్తెతో కలిసి ఎన్జీఓ కాలనీ వైపు వాకింగ్‌కు బయలుదేరగా.. ఇద్దరు గుర్తు తెలియని యువకులు బైక్‌పై వచ్చి రాధరాణమ్మ మెడలోని బంగారు గొలుసు లాక్కొని వెళ్లిపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పట్టణ సీఐ నారాయణ రెడ్డి మంగళవారం తెలిపారు.

విజిలెన్స్ దాడులు

కదిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. కార్యాలయంలో ఉన్న ఫైల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఫైల్‌లో ఉన్న విధంగా ఉన్నాయో లేదా ఫీల్డ్‌కు వెళ్లి పరిశీలించారు. కొన్ని రికార్డులను వారితోపాటు తీసుకెళ్లినట్లు సమాచారం. కూటమి అధికారంలోకి రాగానే కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపాల్టీలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో 600పైగా అనుమతుల్లో అవకతవకలున్నాయని వెల్లడించారు. ఆ మేరకు అప్పట్లో విజిలెన్స్‌కు లేఖ రాశారు. దానిపై అధికారులు స్పందించినట్లు సమాచారం.


ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

ఘనంగా వేమన ఉట్ల తిరునాళ్ల

గాండ్లపెంట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లిలో శ్రీయోగివేమన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉట్ల తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. ఆలయం వెలుపల 30 అడుగుల ఇనుప ఉట్లమాను ఏర్పాటుచేశారు. ఆ ఉట్లమానును ఎక్కడానికి యువకులు జట్లుజట్లుగా పోటాపోటీ పడ్డారు. దాదాపు గంటపాటు ఈ కార్యక్రమం జరిగింది. కాగా, ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

శేషవాహనంపై శ్రీవారు


శేషవాహనంపై శ్రీలక్ష్మీనారాయణస్వామి

బుక్కపట్నం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనారాయణస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారిని శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. బ్రహోత్సవాల్లో భాగంగా 10న గరుడసేవ, 11న కల్యాణోత్సవం, 12న రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రధానార్చకులు హరిస్వామి తెలిపారు.

బియ్యం గోడౌన్ తనిఖీ

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డివారిపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ బియ్యం గోడౌన్‌ను ఆర్డీఓ సువర్ణ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులతో పాటు, గోడౌన్‌లో నిలువ ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ అనంతచారి, స్టాకిస్టు మనోహర్ ఉన్నారు.

సాగునీటి పథకాల గణనపై శిక్షణ

బత్తలపల్లి మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక తాహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్ఓలకు చిన్నతరహా సాగు నీటి పథకాల గణనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. డివిజినల్ గణాంక అధికారి గోపాల్ ఏఎస్ఓ శర్మ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న బావులు, బోర్లు చెరువుల, కుంటలు, చెక్‌డ్యాములను ఆన్‌లైన్ సర్వే చేయాలని సూచించారు. ప్రతి వీఆర్ఓను సాగునీటి పథకాలను జీయోట్యాగ్ ద్వారా గణనను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తాహసీల్దార్ స్వర్ణలత, వీఆర్ఓలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మామిడి రైతులకు అవగాహన సదస్సు



పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం పట్టణంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ పలు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వం మామిడి రైతులకు ఇస్తున్న ప్రోత్సాహాలను వివరించారు. మామిడి పిందె నుంచి కోత వరకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. 350 గ్రాములకు పైగా ఉన్న బేనిషా రకం మామిడిని ఎలాంటి కమీషన్ లేకుండా కొనుగోలు చేస్తామని సూపర్‌ప్లమ్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నరసింహమూర్తి, ఉద్యానశాఖ అధికారులు రాంప్రసాద్, సూపర్‌ప్లమ్ కంపెనీ ప్రతినిధులు జీవీ సింగ్, ప్రవీణ్, ప్రశాంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

మడకశిరటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పాల్గొననున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు.

ముందస్తు చెల్లింపుతో రాయితీ పొందండి

పెనుకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో నివాసముంటున్న భవన, ఖాళీ స్థలాల యజమానులు 2025-26 ఆర్థిక సంవత్సరానికి పన్నులను ఈనెల 30లోగా ముందస్తుగా చెల్లించి ఐదు శాతం రాయితీ పొందవచ్చని కమిషనర్ సతీష్‌కుమార్ ఓ ప్రకటనలో కోరారు. యజమానులు తమకు సంబంధించిన సచివాలయంలోకానీ, ఆన్‌లైన్, కార్యాలయ కౌంటర్లలో చెల్లించవచ్చన్నారు. ఈ నెల 7నుంచి 30లోగా ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5-30 వరకు కౌంటర్లలో పన్నులు చెల్లించవచ్చన్నారు.

గుండెపోటుతో టెక్నీషియన్ మృతి



పావగడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద సంఘం గ్రామాంతర ఆసుపత్రి జపానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆసుపత్రిలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న తిప్పేస్వామి (51) మంగళవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. గత 15 సంవత్సరాల నుంచి ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న తిప్పేస్వామి.. విధినిర్వహణలోఉండగా ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. స్వామీజీనే నమ్ముకుని బతుకుతున్న తిప్పేస్వామి కుటుంబానికి పరిహారం అందించాలని కుటుంబాన్ని ఆదుకోవాలని పలు స్వచ్ఛంద సేవా సంస్థలు కోరాయి.

కర్ణాటక మద్యం స్వాధీనం: ఇద్దరి అరెస్ట్

మడకశిర రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గుండిబండ మండలం మద్దనగుంట క్రాస్ వద్ద మంగళవారం కారులో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసి కారునుసీజ్ చేసినట్లు మొబైల్ పార్టీ ఇన్‌స్పెక్టర్ గురునాథ్ రెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐలు సత్యనారాయణ, శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్ణాటక నుంచి కారులో 960 మద్యం ప్యాకెట్లు అక్రమంగా జిల్లాలోకి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కారును సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.49,440 ఉన్నట్లు తెలిపారు.

● హిందూపురం: కర్ణాటక నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదుచేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. పరిగి మండలానికి చెందిన జగదీశ్, పెద్దరెడ్డిపల్లి వెంకటేశ్, సురేష్, కోడూరు ఆదినారాయణ, మరొకరు కలిసి కర్ణాటక నుంచి మద్యం తీసుకొస్తుండగా ఎక్సైజ్ అధికారులు దాడిచేసి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. వీరి నుంచి 332 ప్యాకెట్లు మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

లేపాక్షి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కూలీల వలసలను ఆపి స్థానికంగా ఉపాధి కల్పించడమే ఉపాధి పథకం ముఖ్య ఉద్దేశ్యమని ఏపీఓ చంద్రశేఖర్ అన్నారు. బిసలమానేపల్లి పంచాయతీ రాజీవ్ కాలనీలో మంగళవారం ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి బిల్లులు పెండింగ్ లేకుండా త్వరలోనే చెల్లించేస్తామని, ఉపాధికూలీ సైతం రూ.7 పెంచారని అన్నారు. సక్రమంగా పనులుచేసుకుంటే వలస వెళ్లాల్సిన అవసరం లేదని కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ధర్నా

గోరంట్ల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారి గుండా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యాలయం వద్ద ధర్నాలో నాయకులు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న క్లామ్‌లకు వెంటనే నిధులు మంజూరు చేయాలన్నారు. కేంద్రం అమలు చేయనున్న లేబర్ కోర్టులను వెంటనే రద్దు చేయాలని, సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, తమపిల్లలకు ఉపకార వేతనాలు మంజూరు చేయాలని, అన్ని సంక్షేమపథకాలు కార్మికులకు అందేలా చూడాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలంలో వీఆర్ఓ అశోక్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు అంకె ముత్యాలు, బేళ్ల ఆంజి, కొండె వెంకటేష్, వెంకటరామప్ప, బాబ్‌జాన్, మహబూబ్ బాషా తదితరులున్నారు.



గోరంట్లలో ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

పెరిగిపోతున్న అసాంఘిక కార్యకలాపాలు

● శాంతికి కేంద్రంగా ఉన్న మడకశిరలో వరుస ఘటనలు ● కిడ్నాప్‌లు, హత్యలతో కలకలం



మడకశిర పోలీస్‌స్టేషన్, కిడ్నాపర్ల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను చూపుతున్న ఎస్పీ రత్న, సిబ్బంది(ఫైల్)

మడకశిరటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు మారుపేరైన మడకశిర నియోజక వర్గంలో ఇటీవల అశాంతి పెరిగి పోయింది. గతంలో నియోజకవర్గంలో కిడ్నాప్‌లు, హత్యలు జరిగిన ఘటనలు కనిపించేవి కావు. ఇటీవల నియోజకవర్గంలో కిడ్నాప్‌లు, హత్యలతో కలకలం రేగుతోంది. గత నవంబరు నెలలో మండల పరిధిలోని అచ్చంపల్లికి చెందిన ఓ బాలుడిని కిడ్నాప్ చేసి కర్ణాటక రాష్ట్రం పావగడ సమీపంలో హత్య చేశారు. అది మరువక ముందే ఐదు రోజుల క్రితం గుడిబండ మండలంలోని బీటీ పల్లికి చెందిన మనోహర్‌తోపాటు మరో ఇద్దరిని కిడ్నాప్ చేసి రూ.5 కోట్లు డిమాండ్ చేశారు. నగదు తీసుకొని వస్తానంటూ కిడ్నాప్ అయిన మనోహర్ చాకచక్యంగా పోలీసులకు సమాచారం అందించి వారిని పట్టించాడు. పోలీసులు ఏడుగురిని అరెస్టు చేసి రూ.1.50 లక్షలు నగదు, రెండు వాహనాలు, మూడు తుపాకులు, ఏడు తూటాలు, ఓ కత్తిని స్వాధీనం చేసుకొన్నారు. వారం రోజుల క్రితం మండల పరిధిలోని ఉగ్రేపల్లి సమీపంలో ఓ మహిళను హత్యచేసి పడేసినట్లు క్లూస్‌టీమ్‌తోపాటు స్థానిక పోలీసులు సైతం వెళ్లి కనుగొనే ప్రయత్నం చేశారు. ఆ మహిళకు సంబంధించి ఎలాంటి వివరాలు తెలియలేదు. మడకశిర లాంటి ప్రాంతంలో సైతం ఇలాంటి ఘటనలు జరగడం పట్ల నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభంలోనే నేరాలను అరికట్టకపోతే సరిహద్దులో ఉన్న మడకశిర లాంటి ప్రాంతాలు కేంద్ర బిందువుగా మారుతాయని, ఆదిలోనే పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎస్పీ రత్న సైతం సంఘటనలపై ఆరాతీస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ త్వరితగతిన కేసులను ఛేదించేందుకు చర్యలు తీసుకొంటున్నారు. బాలుడి హత్య ఘటన సైతం 24 గంటల్లోనే ఛేదించి నిందితులను జైలుకు పంపారు. అదే విధంగా రెండు రోజుల క్రితం కిడ్నాప్‌కు సంబంధించిన ఘటనలో సైతం సీరియస్‌గా తీసుకొని వెంటనే కిడ్నాపర్ల నుంచి ముగ్గురి ప్రాణాలు కాపాడారని ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిషత్తులో ఇలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ



ప్రత్యేకాలంకరణలో సీతారామచంద్రులు, ప్రవాస భారతీయుడు శేషాద్రిరెడ్డి, వనజ దంపతులు, వేషధారణలో ఉన్న చిన్నారులతో కోలాట బృందం

గోరంట్ల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూడిదగడ్డపల్లిలో నూతనంగా నిర్మించిన పట్టాభిరామచంద్రస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థుడు, ప్రవాస భారతీయుడు కోట్లో శేషాద్రిరెడ్డి, వనజ దంపతులు పురాతన ఆలయం స్థానంలో నూతన ఆలయాన్ని గ్రామస్థులతో కలిసి నిర్మించారు. పురోహితుడు శేఖర్ స్వామి ఆధ్వర్యంలో వేదపడింతులు సీతారాముల విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ, గోపుర కలశ స్థాపన, మూల విగ్రహాలకు ప్రత్యేకాలంకరణ, విశేషపూజలు, మహా మంగళహారతి నిర్వహించారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొనగా, పెద్దఎత్తున అన్నదానం చేశారు. బ్రహ్మకుమారిలు ఏర్పాటు చేసిన కోలాటం, సీతారామచంద్రుల వేషాలంకరణలో చిన్నారుల కార్యక్రమం అలరించింది. అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ అధ్యక్షురాలు దేవరకొండ కౌసల్య బృందం ప్రత్యేకంగా నిర్వహించిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జలకాలాటలలో..

సోమందేపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అసలే వేసవి.. ఆపై ఎండలు మండుతున్నాయి... వేడిమి తాపానికి సేద తీరడానికి సోమందేపల్లి వాసులు మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి హంద్రీ నీవా కాలువలో ఈత కొడుతూ కనిపించారు. కాలువలో వేడి నుంచి ఉపశమనం పొందారు. హిందూపురం రోడ్డు పక్కన నక్కలగుట్ట సమీపంలో ఈ దృశ్యం కనిపించింది. ఈత కొడుతూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



హంద్రీనీవా కాలువలో జలకాలాడుతున్న దృశ్యం

వైద్య శిబిరానికి విశేష స్పందన



ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

పెనుకొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సహకారంతో మంగళవారం సత్యసాయి సేవామందిరంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రతి నెలా రెండో మంగళవారం నిర్వహిస్తున్న ఈ వైద్యశిబిరంలో క్యాన్సర్, లివర్, కిడ్నీ, పక్షవాతం రోగులను పరిశీలించి వైద్య సేవలు అందిస్తున్నారు. హోమ్‌కేర్ కింద పేర్లు నమోదుచేసుకున్న పెనుకొండ, లోచర్ల, కొత్తచెరువు గ్రామాలకు చెందిన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సహకారం అందించి అవసరమున్నవారికి మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తికి రావాలని పేర్కొన్నారు.

పాలసముద్రం వద్ద కేంద్రీయ విద్యాలయం

గోరంట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం వద్ద గల నాసిన్ ఆకాడమీలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎంఈఓ జాన్‌రెడ్డెప్ప తెలిపారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం ప్రస్తుతం నాసిన్ అకాడమీవారు తాత్కాలిక భవన వసతి సదుపాయం కల్పించారు. పది ఎకరాలను కేంద్రీయ విద్యాలయం భవన నిర్మాణాల కోసం అకాడమి స్థలాన్నికేటాయించింది. దీంతో హైదరాబాద్ కేంద్రీయ విద్యాదాలయం, రీజనల్ కార్యాలయం, అసిస్టెంట్ కమిషనర్, క్రిష్ణవేణి, రాప్తాడు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ మార్కండేయులు, లైజనింగ్ అధికారి జాన్‌రెడ్డెప్ప మంగళవారం తాత్కాలిక భవనంలోని వసతులను పరిశీలించారు. పరిశీలానంతరం అసిస్టెంట్ కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేయడంతో త్వరలో పాలసముద్రం కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు జాన్‌రెడ్డెప్ప తెలిపారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా త్వరలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖ సహాయ అధికారి గంగాధర్ ఓ ప్రకటనలో మంగళవారం పేర్కొన్నారు. టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈడబ్ల్యుఎస్ క్యాటగిరికి చెందిన అభ్యర్థులు డీఎస్సీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ దరఖాస్తులు 10వ తేదీ నుంచి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9392141545కు సంప్రదించాలన్నారు.

'ఉన్నత పాఠశాలగా మార్చండి'



పరిశీలనాధికారికి వినతి పత్రం అందిస్తున్న గ్రామ పెద్దలు

గోరంట్ల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరేవాండ్లపల్లి ప్రాథమికోన్నతపాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్పు చేయాలని పరిశీలనాధికారిని స్థానికులు మంగళవారం కోరారు. ఉన్నత పాఠశాలగా మార్చడానికి అన్ని వసతులు ఉన్నాయని, స్కూల్ కమిటీ, గ్రామ సర్పంచ్, గ్రామస్థులు ఇటీవల ఏకగ్రీవంగా తీర్మానించారని తెలిపారు. దీంతో వానవోలు క్లస్టర్ పాఠశాల హెచ్‌ఎం ఈశ్వరమ్మ, కోరేవాండ్లపల్లి పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో భవన వసతులతోపాటు, అభివృద్ధికోసం ఎకరా స్థలం అందుబాటులో ఉందని గ్రామస్థులు అధికారికి వినతిపత్రం అదించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అశ్వర్థరెడ్డి, హెచ్‌ఎం అశోక్, ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, గ్రామ పెద్దలు బాబురెడ్డి, రామచంద్రప్ప, ఈశ్వరయ్య, అశోక్‌రెడ్డి, నాగేంద్ర, రంగయ్య, లక్ష్మీనరసప్ప పాల్గొన్నారు.

ఉలవ పంట నమోదు పరిశీలన

చిలమత్తూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్లో ప్రభుత్వం అందించిన రాయితీ ఉలవ పంటలను ఏడీఏ పద్మలత, ఏఓ అర్చన మంగళవారం తనిఖీ చేశారు. మండలంలో 40 క్వింటాళ్ల ఉలవలను ప్రభుత్వం రైతులకు రాయితీ ధరకు అందజేసింది. దాంతో ఖరీఫ్‌లో 400 ఎకరాలలో ఉలవ పంట సాగయింది. దీనికి సంబంధించి ఎంత మంది రాయితీతో ఉలవలు తీసుకున్నారు? ఎంత మంది వాటిని సద్వినియోగం చేసుకున్నారు? పంట ఎంత మందికి చేతికందింది? సాగైన పంట సక్రమంగా ఈ-క్రాప్ బుకింగ్ జరిగిందా? అనే విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు ఈ-క్రాప్ బుకింగ్ జరిగిన పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. అనంతరం సాగైన పంటల వివరాలు క్రాప్ బుకింగ్ జరిగిందా? లేదా అనే విషయాలను మండల కేంద్రంలోని ఆర్‌బీకేలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ వంశీకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా శ్రీరాముడి రథోత్సవం



శ్రీరాముడి రథాన్ని లాగుతున్న భక్తులు, ఉట్లమాను ఉత్సవాన్ని తిలకిస్తున్న జనం

మడకశిర రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠాపురంలో శ్రీరామనవమి పురష్కరించుకుని మూడురోజుల పాటు స్వామి వారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్వామి బ్రహ్మరథోత్సవం అత్యంత వైభంగా జరిగింది. ఉదయం ఆలయంలో హోమాలు చేపట్టి మధ్యాహ్నం రథోత్సవం నిర్వహించారు కళాకారుల ఆటపాటలో ఎంతో ఆకట్టుకుంది. అనంతరం సాయంత్రం ఉట్లమాను పరుష ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి సతీమణి సునీతరఘువీర్, మాజీ మర్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, గోవిందాపురం, నీలకంఠాపురం, గంగళవాయిపాళ్యం గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలి వచ్చారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



ఆందోళన చేస్తున్న ఐద్వా సంఘం సభ్యులు

పెనుకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి కుటుంబాల నడ్డి విరిచేవిధంగా కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐద్వా సభ్యులు నిరసన తెలిపారు. మంగళవారం తిమ్మాపురం గ్రామంలోని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల అధ్యక్షురాలు గౌతమి ఆధ్వర్యంలో మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వానికి చమురు కంపెనీల యజమానులకు లాభాలు తప్ప పేద, మధ్య తరగతి ప్రజల గురించి ఆలోచన లేదన్నారు. నిత్యం గ్యాస్, డీజిల్ ధరలు పెంచి ఆర్థిక భారం మోపుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ ధరల పెంపుపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఆమోదం పలకడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకులు అరుణ, అమృత, గాయిత్రి, నాగమణి, కాంతమ్మ, ముత్యాలమ్మ, హనుమక్క, సుకన్య, పాల్గొన్నారు.

సమష్టిగా అభివృద్ధి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

లేపాక్షి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారుల సమష్టి కృషితో హిందూపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధి పరంగా మొదటి స్థానంలో నిలపాలని ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య పేర్కొన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో ప్రభుత్వ అధికారులు, టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు పనినిమిత్తం ప్రజలు వస్తే మర్యాదగా మాట్లాడాలన్నారు. వినయంగా వారి సమస్యలను అడిగి పరిష్కారానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. నిధుల కొరత లేకుండా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపుతున్నారని, అలాంటప్పుడు మనం నిజాయితీగా పనిచేసి అభివృద్ధి పరంగా ప్రత్యేక స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ నాగరాజునాయక్, టీడీపీ మండల కన్వీనర్ జయప్ప, అన్నిశాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా తుమ్మల మారమ్మకు హారతుల ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో తుమ్మల మారమ్మ

గుడిబండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలిసిన తుమ్మల మారమ్మకు భక్తులు హారతులు మోసి మొక్కులు తీర్చుకొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ రాజకుళ్లాయప్ప ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి ఉత్సవాలు సజావుగా సాగేందుకు పర్యవేక్షించారు. కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు.



అలంకరణలో వలస మారమ్మ దేవి

● అమరాపురం : మండలపరిధిలోని వలస గ్రామంలో రెండు రోజుల పాటు మారమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయాన్నే వివిధ రకాల పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు మారమ్మ దేవిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేరలోని జమ్మిచెట్టు వద్దకూర్చొబెట్టి నడలుడెం, విరుపసముద్రం గ్రామాల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన హారతి ఉత్సవాలను మేళ తాళాల మధ్య మారమ్మ దేవాలయానికి తీసుకొచ్చారు. అనంతరం భక్తులు మొక్కుబడిగా బెల్లం, ఎర్రగడ్డలు, గొర్రెలు, పొట్టేళ్లను, మేకపోతులను బలి ఇచ్చారు.

ఘనంగా బీఎస్ నకారా జయంతి

మడకశిరటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం బీఎస్ నకారా జయంతిని ఘనంగా నిర్వహించారు. బీఎస్ నకారా పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఎంతగానో కృషి చేశారని గుర్తు చేసుకొన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు గణపతి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ విభాగంలో పావగడ విద్యార్థికి రెండో ర్యాంక్



పావగడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఇంద్రకొండ గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది లింగయ్య గౌడ తనయుడు రాజు యదువంశీ యాదవ్ పీయూసీ సైన్స్ విభాగంలో 600 మార్కులకు 598 మార్కులు పొంది రాష్ట్రంలోనే రెండో ర్యాంక్ సాధించాడు. మారుమూల గ్రామమైన ఇంద్రకొండ విద్యార్థికి రాష్ట్రంలో రెండో ర్యాంకు రావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. రాజు పదోతరగతిలో కూడా 94 శాతం మార్కులు పొందాడు. దక్షిణ కన్నడ జిల్లాలోని మూడుబెదిరే అల్వాస్ కళాశాలలో పీయూసీ చదువుతున్నాడు. మార్చిలో జరిగిన పరీక్షల ఫలితాలు వెలువడగా. రాష్ట్రంలోని సైన్స్ విభాగంలో రెండో ర్యాంక్ సాధించినట్లు కాలేజీ వర్గాలు తెలిపాయి.

ప్రజల హక్కులను కాపాడాలి

పావగడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలో అంబేడ్కర్ కల్పించిన మౌలిక సదుపాయాలు, హక్కులను ప్రజలకు అందించాలని విశ్వహిందూపరిషత్, బజరంగదళ ఆధ్వర్యంలో మంగళవారం పావగడ పట్టణంలో ధర్నా చేపట్టారు. శని మహాత్మ సర్కిల్ నుంచి ర్యాలీగా వచ్చి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బజరంగదళ్ జిల్లా కన్వీనర్ సుమన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు కోసం ప్రజల సొమ్మును దోచి ధర్మాల పేరిట రిజర్వేషన్ కల్పించడం దారుణం అన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. కార్యక్రమంలో పలువురు బజరంగదళ్, విశ్వహిందూపరిషత్ నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బజరంగదళ్ నాయకులు